


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 15 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 38 పేజీలు : 4 వెల : రూ 3-00


## 'మత్స్యకారులకు ఆదాయం రావడం టీడీపీకి ఇష్టం లేదా?'



తాడేపల్లి: చెరువులపై ఆధారపడి జీవించే వర్గాలను ఆర్థికంగా పైకి తీసుకురావాలని ప్రభుత్వం ఆశించిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మత్స్యకారుల ద్వారా చెరువుల నిర్వహణ చేపట్టామని, అందుకోసం వందల ఎకరాలు పైబడిన చెరువలను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా నెల్లూరు జిల్లాలో చెరువులపై ఆధారపడి జీవించే వారి కోసం జీవో 217 తీసుకొచ్చామని తెలిపారు. 100 హెక్టర్స్ పైనున్న 28 చెరువులను దీని కిందకు తీసుకొచ్చాన్నారు. వాటిని అధ్యయనం చేసి సొసైటీ సభ్యులకు కనీసం రూ.15000 ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పైలెట్ ప్రాజెక్టుగా నెల్లూరు జిల్లాను ఆ జీవో కింద తీసుకున్నామని తెలిపారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్రం మొత్తం అమలు చేస్తున్నారని ప్రతిపక్షం గ్లోబల్ ప్రచారం చేస్తోందని మోపిదేవి మండిపడ్డారు. ఇది నెల్లూరు జిల్లాకు మాత్రమే వర్తిస్తుంది అని జీవోలో స్పష్టంగా ఉందని గుర్తుచేశారు. అక్కడ అమలు చేసి మంచి ఫలితాలు వస్తే అప్పుడు ఆలోచించాలని భావించామని చెప్పారు. మత్సకారులకు ఆదాయం రావడం సంతోషమా కాదా అనేది టీడీపీ వారు చెప్పాలని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విదంగా ఏపీలో మత్స్యకారులకు అనేక పథకాలు పెట్టామని అన్నారు. లబ్ధిదారుల సంఖ్య కూడా రెట్టింపు అయ్యిందని పేర్కొన్నారు. డీజిల్ టీడీపీ హయాంలో రూ. 6 సబ్సిడీ ఉంటే తాము రూ. 9 చేశామని, ఎవరైనా మత్స్యకారుడు దురదృష్ట వశాత్తు చనిపోతే గతంలో ఇన్సూరెన్స్ కూడా వచ్చేది కాదని, ఇప్పుడు వెంటనే 10 లక్షలు అందిస్తున్నామని మోపిదేవి తెలిపారు. ప్రతి జిల్లాలో ఫిషింగ్ హార్బర్స్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పించారని తెలిపారు. ఫేజ్ 1 కింద 5 హార్బర్లు పనులు జరుగుతున్నాయని, ఫేజ్ 2 కింద కూడా మిగతావి ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

## వైద్యం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవసరం ఉండకూడదు: సీఎం జగన్



తాడేపల్లి: హెల్త్‌హబ్స్ ద్వారా ఏర్పాటయ్యే ఆస్పత్రుల్లో కనీసం యాభై శాతం బెడ్లను ఆరోగ్యశ్రీ పేషెంట్లకు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆరోగ్య బీమా కంపెనీలు చెల్లిస్తున్న ఛార్జీలతో పోలిస్తే ఆరోగ్యశ్రీ కింద చెల్లిస్తున్న ఛార్జీలు మెరుగ్గానే ఉన్నాయన్నారు. ఎవరెక్కువ బెడ్లను ఆరోగ్యశ్రీకి కేటాయిస్తే వారికి హెల్త్‌హబ్స్‌లో ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలని సీఎం పేర్కొన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య, ఆరోగ్య శాఖపై మంగళవారం సమీక్ష చేపట్టారు. అదే విధంగా రాష్ట్రంలో కోవిడ్ పరిస్థితులు, వ్యాక్సినేషన్, హెల్త్ హబ్స్, ఆస్పత్రుల నిర్వహణ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లపై కూడా సీఎం అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. హెల్త్‌హబ్స్ ద్వారా వచ్చే ఆస్పత్రుల బోర్డుల్లో ఒక సభ్యుడు ప్రభుత్వం నుంచి ఉంటారని తెలిపారు. రాష్ట్రానికి చెందిన డాక్టర్లు ఇక్కడే స్థిరపడి మంచి వైద్య సేవలు అందించే ఉద్దేశం కూడా హెల్త్‌హబ్స్ ద్వారా నెరవేరుతుందన్నారు. డాక్టర్లు నిరంతరం అందుబాటులో ఉండాలన్నది ఆస్పత్రుల ఎంపికకు ఒక ప్రమాణం కావాలని తెలిపారు. అవయవ మార్పిడి చికిత్సలు చేసే ఆస్పత్రుల ఏర్పాటుపై హెల్త్ హబ్స్‌లో ప్రత్యేక దృష్టిపెట్టాలని పేర్కొన్నారు.

వైద్యం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవసరం ఇక ఉండకూడదని సీఎం స్పష్టం చేశారు. లాభాపేక్షలేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్న సంస్థలకూ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం చెప్పారు. వివిధ వైద్య సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అనుసరిస్తున్న నిర్వహణా విధానాలను సీఎంకు అధికారులు వివరించారు. ఆస్పత్రుల నిర్వహణకోసం ప్రత్యేక అధికారుల నియమిస్తున్నట్లు తెలిపారు. బిల్డింగ్ సర్వీసులు, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసులు, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సేవలను అధికారులు నిర్వహించనున్నారు. సీహెచ్‌సీల నుంచి బోధనాసుపత్రుల వరకూ నిర్వహణ కోసం అధికారుల నియామకానికి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఉత్తమ నిర్వహణా పద్ధతులకు అనుగుణంగా కొత్తగా నిర్మిస్తున్న ఆస్పత్రులు, బోధనాసుపత్రుల నిర్మాణాలు ఉండాలని సీఎం ఆదేశించారు. అలాగే వీటి డిజైన్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఆస్పత్రుల్లో బెడ్ల నిర్వహణ, బాత్రూమ్‌ల నిర్వహణ, పరిశుభ్రత, ఆహారంలో నాణ్యత చాలా ముఖ్యమని తెలిపారు. రిసెప్షన్ సేవలు కూడా కీలకమని అన్నారు. సరిపడా వైద్యులు, పైన పేర్కొన్న సేవలు నాణ్యతతో అందితే కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా సేవలు అందినట్లేనని పేర్కొన్నారు. అత్యుత్తమ నిర్వహణా పద్ధతులను ప్రభుత్వ ఆస్పత్రుల్లో అమలు చేయాలని, ఎవరి ఆరోగ్యం బాగోలేకపోయినా అందరూ కూడా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లే పరిస్థితి ఉండాలని సీఎం వైఎస్ జగన్ ఆకాక్షించారు. ఆస్పత్రుల నిర్వహణలో పర్యవేక్షణ స్థాయి బలోపేతంగా ఉండాలని, నిర్ణీత రోజులకు మించి సెలవులో ఉంటే.. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

## గణేష్ నిమజ్జనం పై నెలకొన్న గందరగోళం

హైదరాబాద్ హైదరాబాద్ లో గణేష్ నిమజ్జనం పై నెలకొన్న గందరగోళం ఇంకా వీడలేదు. ట్యాంక్ బండ్ లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు నిమజ్జనం చేయడానికి హైకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పు నేపథ్యంలో సర్కార్ సమాలోచన లో పడింది. మరోవైపు, అధికారులు ఇప్పటికే ట్యాంక్ బండ్ లో నిమజ్జనం ఏర్పాట్లు మొదలు పెట్టారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మాత్రం ట్యాంక్ బండ్ లోనే గణేష్ నిమజ్జనం చేస్తామంటుంది. పోలీసులు నిమజ్జనం కు వచ్చే విగ్రహాలను అడ్డుకుంటే రోడ్డు మీద నే నిరసన వ్యక్తం చేస్తామని అంటోంది. గణేష్ నిమజ్జనం పై సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిమజ్జనం పై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, హైకోర్టు తీర్పు పై అధికారుల మల్లగుల్లాలు పడుతున్నారు. హైకోర్టు తీర్పు ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టు లో ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయనుంది. మరోవైపు ప్రత్యామ్నాయా ఏర్పాట్ల దిశగా ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు: క్షమాపణ కోరిన అచ్చెన్నాయుడు

విజయవాడ: ఏపీ అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ సమావేశమైంది. ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన భేటీ జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడిపై వచ్చిన ఫిర్యాదుపై ప్రివిలేజ్ కమిటీ విచారణ జరిపింది. కమిటీ ముందు హాజరైన అచ్చెన్నాయుడు క్షమాపణ కోరారు. ఎమ్మెల్యే జోగి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమిటీ విచారణ చేపట్టింది. గతంలో స్పీకర్ తమ్మినేనిపై అచ్చెన్నాయుడు అనుచిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అచ్చెన్నాయుడు అనుమతి లేకుండా న్యాయవాదిని తీసుకురాగా, ప్రివిలేజ్ కమిటీ అభ్యంతరం తెలిపింది.



కమిటీ సభ్యుల అభిప్రాయం మేరకు తదుపరి నిర్ణయం: కాకాణి

సమావేశం అనంతరం ప్రివిలైజ్ కమిటీ చైర్మన్ కాకాని గోవర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని.. ఆయన వివరణను కమిటీ సభ్యులకు పంపిస్తామని తెలిపారు. కమిటీ సభ్యుల అభిప్రాయం మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కూన రవి అందుబాటులో లేనని సమాచారం ఇచ్చారని.. మరొక అవకాశం ఇస్తే కమిటీ ముందు హాజరవుతానని తెలిపారని కాకాణి చెప్పారు. నిమ్మగడ్డ రమేష్, రామానాయుడులపై 21న జరిగే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని కాకాణి తెలిపారు.

## ప్రాంతీయ భాషలకు హిందీ ఫ్రెండ్‌లాంటిది : అమిత్ షా

న్యూఢిల్లీ : ప్రజలు తమ మాతృ భాషతోపాటు హిందీని ఉపయోగించేందుకు ప్రతిజ్ఞ చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. భాష విషయంలో కూడా భారత దేశం స్వయం సమృద్ధం కావలసి ఉందని తెలిపారు. హిందీ దినోత్సవాల సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వయం సమృద్ధం కావడమంటే కేవలం మన దేశంలో వస్తువులను ఉత్పత్తి చేయడానికి సంబంధించినది మాత్రమే కాదన్నారు. భాష విషయంలో కూడా మనం స్వయం సమృద్ధి సాధించాలని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ స్థాయిలో హిందీ మాట్లాడుతున్నపుడు మనం దేని గురించి ఇబ్బంది పడాలని ప్రశ్నించారు. హిందీ మాట్లాడటం ఆందోళనకు కారణమయ్యే రోజులు పోయాయన్నారు. మాతృ భాషను, అధికార భాషను సమన్వయపరచడంలోనే భారత దేశ అభివృద్ధి ఉందన్నారు. ప్రాథమిక వ్యవహారాల్లో మాతృ భాషతోపాటు హిందీని ఉపయోగిస్తామని ప్రజలు హిందీ దినోత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. అధికార భాషల్లో హిందీ ఒకటి అని తెలిపారు. హిందీ, ఇతర భారతీయ భాషలు సమాంతరంగా అభివృద్ధి చెందడం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## ఢిల్లీలో ఆపదలో ఉన్న మహిళను కాపాడిన 'దిశ యాప్'




వైఎస్సార్ జిల్లా: మహిళల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'దిశ యాప్' సత్ఫలితాలను ఇస్తోంది. ఆపదలో ఉన్న మహిళలను కాపాడుతోంది. తాజాగా దిశ యాప్ సాయంతో దేశ రాజధాని ఢిల్లీలో ఆపదలో ఉన్న మహిళను పోలీసులు కాపాడారు. పోరుమామిళ్లకు చెందిన సుభాషిణి అనే యువతి.. ఉపాధ్యాయ పరీక్ష రాసేందుకు ఢిల్లీ వెళ్లారు. అక్కడ ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో సదరు యువతితో ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించాడు. వెంటనే దిశ యాప్ ఎస్‌వోఎస్ ద్వారా జిల్లా ఎస్పీకి ఫోను ద్వారా ఆ మహిళ ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన వైఎస్సార్ జిల్లా పోలీసులు సకాలంలో ఢిల్లీ పోలీసులను సంప్రదించి, స్థానికం స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆ మహిళను పోలీసులు సురక్షితంగా కాపాడారు. ఆటో డ్రైవర్ నుంచి కాపాడి కడపకు చేరే వరకు యువతికి పోలీసులు అండగా నిలబడ్డారు. ఆపదలో ఉన్న సమయంలో తనను క్షేమంగా గమ్యానికి చేర్చిన జిల్లా పోలీసులకు బాధిత యువతి ధన్యవాదాలు తెలిపింది. జిల్లా ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ, దిశ యాప్ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణకే ఏపీ రూ. 4,457 కోట్ల బాకీ

హైదరాబాద్ : తెలంగాణ నుంచి తమకు రావాల్సిన బాకీలను చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ ఏపీ జెన్‌కో తెలంగాణ హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో విద్యుత్ బకాయిలపై తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ విద్యుత్ సంస్థలే తెలంగాణకు బాకీ ఉన్నాయి. తెలంగాణకు ఏపీ రూ. 4,457 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. విద్యుత్ బకాయిలు ఇప్పించాలంటూ నిన్న హైకోర్టులో ఏపీ పిటిషన్ దాఖలు చేసింది. ఏపీ చెల్లించాల్సిన బకాయిల గురించి మాత్రం మాట్లాడట్లేదు. ఉమ్మడి ఏపీలో తీసుకున్న రుణాలను తెలంగాణ చెల్లిస్తోంది. తెలంగాణ రూ. 2,725 కోట్లను చెల్లిస్తోంది. ఏపీ జెన్‌కో వాటాల విభజనలో తెలంగాణకు నిధులు రావాలి. కృష్ణపట్నం ప్లాంట్‌లో తెలంగాణ డిస్కంల పెట్టిన పెట్టుబడి సొమ్ము వడ్డీతో సహా రూ. 1,611 కోట్లు రావాలి. బకాయిలన్నీ కలిపి లెక్కిస్తే తెలంగాణకే ఏపీ బాకీ ఉంది. తెలంగాణ విద్యుత్ సంస్థలకే రూ. 4,457 కోట్లు చెల్లించాలి. తెలంగాణకు రావాల్సిన బకాయిలపై ఏపీ స్పందించట్లేదు. తెలంగాణ వాదనలను హైకోర్టుకు వివరిస్తాం అని సీఎండీ ప్రభాకర్ రావు తన ప్రకటనలో పేర్కొన్నారు.



## సినిమా టికెట్లను పారదర్శకంగా ప్రజలకు అందిస్తాం: పేర్ని నాని



అమరావతి: ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే టీడీపీ పనిగా పెట్టుకుందని మంత్రి పేర్ని నాని విమర్శించారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సినిమా టికెట్ల అంశం త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం టిక్కెట్ల వ్యాపారం చేస్తుందని ప్రతిపక్షం నోటికొచ్చినట్లు మాట్లాడుతుందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఆన్‌లైన్‌లో టికెట్ల అమ్మకం జరగాలని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చెయ్యడం కోసమే ప్రభుత్వం ఈ ఆలోచన చేసిందన్నారు. కానీ దీనిపై కొందరు మేధావులు బయలుదేరారని, వారు దీని నేపథ్యం గమనించాలని సూచించారు. సినిమా టికెట్లను పారదర్శకంగా ప్రజలకు అందిస్తామన్నారు. నిబంధనలకు లోబడే షోలు ప్రదర్శించాలని చెప్పారు.

## ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 1,125 కొవిడ్ కేసులు.. 9 మరణాలు

### బులెటిన్ విడుదల చేసిన వైద్యారోగ్య శాఖ

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా 49,568 పరీక్షలు నిర్వహించగా.. 1,125 కొవిడ్ కేసులు నిర్ధారణయ్యాయి. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలో 20,31,974 మంది వైరస్ బారినపడినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. గడిచిన 24 గంటల వ్యవధిలో కొవిడ్ వల్ల 9 మంది బాధితులు ప్రాణాలు కోల్పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా మృతుల సంఖ్య 14,019కి చేరింది. ఒక్కరోజు వ్యవధిలో 1,356 మంది బాధితులు కోలుకోవడంతో ఇప్పటివరకు 20,03,543 మంది కోలుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 14,412 యాక్టివ్ కేసులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,74,13,209 నమూనాలను ఆరోగ్య శాఖ పరీక్షించింది.




## ఏపీఈఏపీ సెట్ ఫలితాలు విడుదల

### ఫలితాలను విడుదల చేసిన మంత్రి ఆదిమూలపు సురేష్

విజయవాడ: రాష్ట్రంలోని అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. మంగళగిరిలోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో 92.85 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 80.62 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. రేపటి నుంచి ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మంత్రి సురేష్ తెలిపారు.



# సంపాదకీయం

బుధవారం 15 సెప్టెంబరు 2021

## కొత్త ట్రెండ్ లో కమలం....

మోదీ సర్కారుకు ప్రజా వ్యతిరేకత తెలిసి వస్తోందా? అంటే అంతా అవుననే సమాధానమే విన్పిస్తోంది. తాజాగా బీజేపీలో జరుగుతున్న నాటకీయ పరిణామాలే ఇందుకు నిదర్శంగా కన్పిస్తున్నాయి. ఇటీవల పలు రాష్ట్రాల్లోని సీఎంలను సైతం బీజేపీ హఠాత్తుగా మార్చేస్తుండటంతో ఆపార్టీకి సెగ భారీగానే తాకుతోందని అర్థమవుతోంది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని మోదీ-షాలు వ్యూహాలు రచిస్తున్న నేపథ్యంలోనే సీఎం మార్పు చర్చనీయాంశంగా మారింది. బీజేపీ జాతీయ నాయకత్వం.. కొత్త పొలిటికల్ ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. గతంలో.. పద్ధతి.. పద్ధతి.. అని చెప్పినట్టుగా కాకుండా.. ఇక తేడా వస్తే.. తోక కట్ చేయడమే.. అన్నట్టుగా నిర్ణయాలు అమలు చేస్తోంది. కొంత కాలంగా.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల మార్పు సైతం ఈ కోవకే చెందుతుంది. పార్టీ లైన్ కు ఏ మాత్రం భిన్నంగా ఉన్నా.. శ్రేణులను సమర్థంగా నడిపించలేకపోతున్నా.. అధిష్టానం ఏ మాత్రం కనికరించడం లేదు.రాబోయే సార్వత్రిక ఎన్నికలే ధ్యేయంగా.. పార్టీ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఉత్తరాదినే కాదు.. దక్షిణాదిపైనా ఫోకస్ చేస్తోంది. ఫైర్ బ్రాండ్ అయిన అమిత్ షా.. వీలు చిక్కినప్పుడల్లా రాష్ట్రాలను సందర్శిస్తూ.. పార్టీ స్థానిక నాయకత్వాలకు క్లియర్ గైడ్ లైన్స్ ఇస్తున్న తీరును కూడా చూస్తున్నాం. త్వరలోనే.. ఆయన తెలంగాణలోనూ పర్యటించనున్నారు.ప్రజల్లో వ్యతిరేకతను తగ్గించేందుకు బీజేపీ ఆయా రాష్ట్రాల్లో వరుసబెట్టి నాయకత్వాన్ని మార్చివేస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.బీజేపీ సర్కారు వరుసగా రెండు పర్యాయాలు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. సింగిల్ గానే ఆ పార్టీకి మెజార్టీ ఉండటంతో బీజేపీ దేశంలో సంస్కరణలపై ఫోకస్ పెట్టింది. ఇదేక్రమంలో దేశంలోకి కరోనా ఎంట్రీ ఇవ్వడంతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. దీనికి తోడు బీజేపీ హయాంలో పెట్రోల్, డిజీల్, వంట గ్యాస్, నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతుండంతో పేద, సామాన్యులపై అధిక భారం పడింది. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకోవాల్సిన సర్కారు పన్నుల పేరుతో దోపిడీకి పాల్పడుతుండటంపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది.దేశంలో బీజేపీ వ్యతిరేక పవనాలు వీస్తున్న తరుణంలో మోదీ సర్కారు అలర్ట్ అవుతోంది. త్వరలోనే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల జరుగున్న నేపథ్యంలోనే బీజేపీ ఆయా రాష్ట్రాల్లోని సీఎంలను వరుసబెట్టి మారుస్తుండటం చర్చనీయాంశంగా మారింది. మొన్నటి మొన్న ఉత్తరాఖండ్, కర్ణాటక సీఎంలను మార్చివేసిన బీజేపీ అధిష్టానం తాజాగా మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్ లోనూ అదే సీన్ రిపీట్ చేసింది. ఉన్నట్టుండి సీఎంతోపాటు మొత్తం మంత్రులందరితో బీజేపీ రాజీనామా చేయించడం చర్చనీయాశంగా మారింది.కర్ణాటకలో యాడ్యూరప్పపై అవినీతి ఆరోపణలున్నాయి. దీనికితోడు ఆయనపై మంత్రుల్లో అసంతృప్తి నెలకొంది. దీని ఫలితంగా జనాల్లో బీజేపీపై వ్యతిరేకత పెరిగిపోయిందని మోదీ సర్కారు భావించింది. ఈమేరకు యాడ్డీని తప్పించి మరొకరిని సీఎం పదవిలో బీజేపీ అధిష్టానం కూర్చోబెట్టింది. కొత్తగా సీఎం అయిన బొమ్మైపై సైతం మంత్రుల్లో, ఎమ్మెల్యేల్లో అసంతృప్తి నెలకొన్నట్లు సమాచారం. కొందరు మంత్రులు శాఖలపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే కొందరు మంత్రులు సీఎంకు వ్యతిరేకంగా మారడంతో వచ్చే ఎన్నికల్లో ఇక్కడ గెలుపు కష్టమేననే టాక్ విన్పిస్తుంది.యడ్డీ కంటే ముందుగా ఉత్తరాఖండ్ సీఎం విషయంలోనూ మోదీ సర్కారు ఇలానే చేసింది. తాజాగా గుజరాత్ సీఎంను మార్చడంతో బీజేపీపై అక్కడి ప్రజల్లో వ్యతిరేకత భారీగానే ఉందనే ప్రచారం జరుగుతోంది. ఈ రెండు రాష్ట్రాల ఫార్మూలానే గుజరాత్ లోనూ బీజేపీ వర్కౌట్ చేసింది. సీఎంపై ఆరోపణలు, అసంతృప్తిని సాకుగా చూపిస్తూ అతడి నుంచి రాజీనామాను కోరింది. త్వరలోనే ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. కేంద్రంపై వ్యతిరేకతకు తోడు రాష్ట్రంలోనూ వ్యతిరేకత వస్తే ఈ ప్రభావం పార్టీకి నష్టం కలుగుతుందని బీజేపీ అధిష్టానం భావిస్తోంది.మోదీ సొంత రాష్ట్రంలో బీజేపీ ఓటమి పాలైతే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుందని గ్రహించిన మోదీ దిద్దుబాటు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే గుజరాత్ లోనూ ఉత్తరాఖండ్, కర్ణాటక ఫార్ములానే బీజేపీ ప్రయోగించింది. సెమీఫైనల్ గా భావిస్తున్న రాబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని చూస్తోంది. దీనిలో భాగంగానే వరుసబెట్టి ఆయా రాష్ట్రాల్లో సీఎంలను మారుస్తున్నారనే టాక్ విన్పిస్తోంది. ఇదిలా ఉంటే సీఎంను మారిస్తే మాత్రం ప్రజల్లో బీజేపీపై వ్యతిరేకత తగ్గుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏదిఏమైనా ప్రజల్లోని వ్యతిరేకత సెగ మోదీ సర్కారు తాకినట్లే కన్పిస్తోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సైతం.. యూపీ నేతలతో భేటీ అయ్యారు.ఇతర నేతలు గుజరాత్ పై ఫోకస్ పెట్టారు. ప్రధాని మోడీ.. ఢిల్లీ నుంచే మంత్రాంగాన్ని నడిపిస్తున్నారు. అమిత్ షా తో పాటు.. ఇతర వ్యూహకర్తలు.. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ.. ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో.. బీజేపీ నాయకత్వ అడుగులు చూస్తుంటే.. తెలుగు రాష్ట్రాల్లోనూ అవసరాన్ని బట్టి మార్పులు తప్పవన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఏపీతో పాటు.. తెలంగాణపైనా ఆ పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టడమే ఇందుకు కారణమవుతోంది.ముఖ్యంగా.. తెలంగాణలో పార్టీకి ఇప్పుడున్న పాజిటివ్ వేవ్ ను కొనసాగించాలని తాపత్రయపడుతోంది. ఆంధ్రాలో టీడీపీని దాటి కనీసం రెండో స్థానానికైనా చేరుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. జనసేనతో కలిసి నడవడం ఇందుకే అన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో.. అటు బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ లకు.. ముందు ముందు మరిన్ని కఠిన సవాళ్లు ఎదురవడం ఖాయంగా కనిపిస్తోంది.తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ఇతర రాష్ట్రాల్లోనూ బీజేపీ నేతలు ఎలా ప్రవర్తిస్తారు.. పార్టీ లక్ష్యాలను ఎలా చేరుకుంటారు.

# మండలికి యూత్ టెన్షన్

విజయవాడ, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో అంతో ఇంతో దూకుడు తప్పదు. పైగా రోజులు మారినట్టే.. రాజకీయాలు కూడా మారిపోయాయి. ఎక్కడ ఎప్పుడు ఎలాంటి పరిణామం చోటు చేసుకున్నా.. తనకు అనుకూలంగా మార్చుకునేవాడేనాయకుడు అనే భావన ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ఇలాంటి సమయంలో ఇంకా మౌనంగానే ఉంటాను. వచ్చేవారే నాదగ్గరకు వస్తారు. నేను మాత్రం గడపదాటను.. మా తాతల పేరుతో ఇంకా కోటల్లోనే ఉంటాను అనే రోజులు ఎప్పుడో వెళ్లిపోయాయి. తమనేత నిత్యం ప్రజల్లో ఉండాలని, ఓడినా.. గెలిచినా.. తమ మొర వినాలని ప్రజలు ఎదురు చూస్తున్న రోజులు ఇవి.అయితే, దీనికి భిన్నంగా కృష్ణాజిల్లా అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ వ్యవహరిస్తున్నారు. 2014లో ఆయన తమ రాజకీయ కల్ప వృక్షం కాంగ్రెస్‌ను వదిలేసి టీడీపీ పంచన చేరిపోయా రు. ఈ క్రమంలోనే గెలుపు గుర్రం ఎక్కి.. డిప్యూటీ స్పీకర్ పదవిని సైతం సాధించారు. ఐదేళ్ల పాటు మండలి బుద్ధ ప్రసాద్ టీడీపీలోనే ఉన్నా జిల్లా టీడీపీ నేతలను మాత్రం ఆయన ప్రతిపక్షంగానే చూసేవారు. నాడు జిల్లా మంత్రి దేవినేని ఉమాతో మండలి బుద్ధ ప్రసాద్ కు అస్సలు పొసగలేదు. ఐదేళ్ల పాటు వారు ఎడమొఖం పెడమొఖంగానే ఉన్నారు.గత ఏడాది ఎన్నికల్లో కుమారుడిని రంగంలోకి దింపాలనుకున్నా సాధ్యం కాలేదు. మండలి బుద్ధ ప్రసాద్ పోటీ చేశారు. ఈ క్రమంలోనే వైసీపీ తరఫున సింహాద్రి రమేష్ విజయం సాధించారు. నిజానికి 2014లో మండలి బుద్ధ ప్రసాద్ పై ఓడిపోయిన సింహాద్రి..పట్టుబట్టి ఇక్కడ నుంచి గెలుపు గుర్రం ఎక్కడం గమనార్హం. ఇక, అప్పటి నుంచి నియోజకవర్గంపై ఉన్న మండలి బుద్ధ ప్రసాద్ ముద్రను చెరిపేసే ప్రయత్నం చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటోన్న ఆయన ఉన్నత విద్యావంతుడు కావడంతో చిన్న విషయంపై కూడా కేర్ తీసుకుంటున్నారు. పించన్ అందుతోందో లేదో స్వయంగా ఆయనే వెళ్లి తెలుసుకుంటున్నారు. రేషన్‌పంపిణీ వ్యవహారంలోనూ ఆయన పర్యవేక్షణ బాగుందని నియోజకవర్గంలోనే టాక్ వినిపిస్తోంది.ఒక రకంగా చెప్పాలంటే.. యువ నాయకుడు దూకుడు పెంచారనే అనాలి. దీంతో ఇప్పటి వరకు ఇక్కడ ఉన్న మండలి బుద్ధ ప్రసాద్ ముద్ర దాదాపు చెరిగిపోతోందనే అనాలి. ఈ నియెజకవర్గంలో మండలి బుద్ధ ప్రసాద్ రాజకీయం నాలుగు దశాబ్దాలకు పైగానే ఉంది. బుద్ధ ప్రసాద్ తండ్రి మండలి వెంకట కృష్ణారావుకు ఇక్కడ తిరుగులేని పేరు ఉంది. ఆ తర్వాత ఆయన రాజకీయ వారసుడిగా ఎంట్రీ ఇచ్చిన మండలి బుద్ధ ప్రసాద్ సైతం మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రి, డిప్యూటీ స్పీకర్ పదవులు అధిరోహించారు. అలాంటి దివిసీమలో ఇప్పుడు మండలి ఫ్యామిలీ ప్రభ చాలా వరకు తగ్గిపోయింది.ఓ వైపు సింహాద్రి రమేష్ దూకుడు ముందే మండలి బుద్ధ ప్రసాద్ ఏం చేయలేక మౌనంగా ఉంటోన్నా కూడా మరోవైపు తన కుమారుడిని రాజకీయ రంగ ప్రవేశం చేయించాలని చూస్తున్నారు. వారసుడిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి దించాలని చూస్తున్నా కూడా మండలి బుద్ధ ప్రసాద్ అందుకోసం కార్యాచరణ లేకుండా, ఉలుకు పలుకు లేకుండా ఇంటికే పరిమితమయ్యారు. అసలు నియోజకవర్గంలో ఉన్నారో.. విజయవాడలో ఉంటున్నారో ? హైదరాబాద్‌లో ఉన్నారో కూడా తెలియని పరిస్థితి ఉందని టీడీపీ వర్గాలే చెవులు కొరుక్కుంటున్నాయి. ఏదేమైనా సింహాద్రి రమేష్ రాజకీయం ముందు మండలి రాజకీయం మసక బారుతున్నట్టే ఉంది.

# నెల్లూరులో టీడీపీకి ఒకే ఒక్కడు

నెల్లూరు, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా అధికార వైసీపీకి కంచుకోట అనే సంగతి తెలిసిందే. ఆ పార్టీ ఎన్నికల బరిలో దిగిన దగ్గర నుంచి జిల్లాలో టీడీపీకి పరాజయాలే ఎక్కువ వస్తున్నాయి. 2014లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చినా సరే నెల్లూరులో వైసీపీ హవానే నడిచింది. మొత్తం 10 సీట్లలో వైసీపీ 7 గెలిచి సత్తా చాటింది. టీడీపీ 3 సీట్లకే పరిమితమైంది. ఇక నెల్లూరు ఎంపీ సీటు సైతం వైఎస్సార్‌సీపీ ఖాతాలోనే పడింది. ఐదేళ్లు అధికారంలో ఉన్నా కూడా చంద్రబాబు ప్రజల్లో గెలిచిన నేతలను కాదని ఎన్నికల్లో ఓడిన సోమిరెడ్డికి, ఎన్నికల్లో పోటీయే చేయని నారాయణకు మంత్రి పదవులు కట్టబెట్టారు. సోమిరెడ్డి చాలా నియోజకవర్గాల్లో గ్రూపులు ఎంకరేజ్ చేయడంతో జిల్లాలో టీడీపీ సర్వనాశనం అయ్యిందన్న విమర్శలు ఉన్నాయి.ఇక 2019 ఎన్నికల్లో వైసీపీ క్లీన్‌స్వీప్ చేసి టీడీపీకి గుండు సున్నా మిగిల్చింది. పైగా వైసీపీ అధికారంలోకి రావడంతో జిల్లాలో టీడీపీ అడ్రెస్ లేకుండా పోతుంది. అసలు ఓడిపోయిన తర్వాత టీడీపీ నాయకులు కంటికి కనిపించడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు హడావిడి చేసిన నాయకులు అధికారం కోల్పోగానే ఎవరి పనులు వారు చూసుకుంటున్నారు. జిల్లాకు పెద్దగా ఉన్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సైతం మీడియా సమావేశాలకే పరిమితమైపోయారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో కోవూరు, నెల్లూరు రూరల్, సూళ్లూరుపేట, వెంకటగిరి, ఉదయగిరి నియోజకవర్గాల్లో చాలా స్థానాలు అధికార పార్టీకి ఏకగ్రీవం అయిపోయాయంటే టీడీపీ పరిస్థితి ఎంబ దారుణంగా ఉందో తెలుస్తోంది.ఇక జిల్లా టీడీపీలో ఇప్పుడు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్రాయాదవ్ ఒక్కడు మాత్రమే యాక్టివ్‌గా ఉంటూ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల విషయానికి వస్తే జిల్లా టీడీపీలో ఎవరు బయటకొచ్చినా, లేకపోయినా నెల్లూరు సిటీ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాత్రం నిత్యం పార్టీ కోసం కష్టపడుతూనే ఉన్నారు. మొన్న ఎన్నికల్లో సిటీ నుంచి పోటీ చేసి మాజీ మంత్రి నారాయణ, అనిల్ కుమార్ యాదవ్ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. ఓడిపోయాక నారాయణ తన వ్యాపారాలు చూసుకుంటున్నారు. దీంతో చంద్రబాబు కోటంరెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా పెట్టారు.ఇక అప్పటి నుంచి కోటంరెడ్డి దూకుడుగా పనిచేసుకుంటున్నారు. ఓ వైపు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసుకుంటూనే, మరోవైపు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ధైర్యంగా వైసీపీ ప్రభుత్వంపై పోరాడుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులని ఎత్తిచూపిస్తున్నారు. ఆ మధ్య కావలిలో ఎన్టీఆర్ విగ్రహం తొలగించడంపై కూడా గట్టి పోరాటం చేశారు. జిల్లాలో ఏ సమస్య ఉన్నా హైలైట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా విజయవంతం చేస్తున్నారు. మిగిలిన వారిలో సూళ్లూరుపేట, కోవూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కావలి ఇన్‌చార్జ్‌ల గురించి చెప్పుకోవడానికేం లేదు. కోటంరెడ్డి తర్వాత వెంకటగిరిలో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ, గూడూరులో అనిల్ మినహా ఎవ్వరూ యాక్టివ్‌గా ఉండడం లేదన్న టాక్ ఉంది. 2014లో ఓడిన శ్రీధర్ కృష్ణారెడ్డి, ఇక నారాయణ కూడా వైసీపీకి ఏ మాత్రం పోటీ ఇవ్వలేకపోయారు. ఇప్పుడు కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి మాత్రమే గట్టిగా పోరాటం చేస్తున్నారు. ఏదేమైనా చాలా రోజులకు జిల్లా కేంద్రంలో టీడీపీకి ఓ గట్టి నేత దొరికాడనే నెల్లూరు తెలుగు తమ్ముళ్లు చెప్పుకుంటున్నారు

# ఉత్తరాంధ్రను ఉద్ధరించింది ఎవరు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)ఉత్తరాంధ్ర అంటే వెనకబడిన ప్రాంతమని ఏకంగా కేంద్రం ఏడేళ్ల క్రితం నియమించిన శ్రీ కృష్ణ కమిషన్ చెప్పింది. వారు వీరూ చెప్పడం ఎందుకు బట్టతల అలా బ్రహ్మాండంగా కనిపిస్తూంటే అని ఆ ప్రాంతానికి చెందిన మేధావులు కూడా అంటారు. ఇక ఈ మూడు జిల్లాలకు ఏమైనా వైభోగం దక్కిందా? అభివృద్ధి అన్నది చూశాయా? అంటే లేదు అన్న మాట అయితే కచ్చితంగా చెప్పాలి. ఈ మూడు జిల్లాలలో విశాఖ సిటీలో కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు, ప్రైవేట్ పరిశ్రమల వల్ల కాస్తా ప్రగతి బాటన ఉన్నట్లు కనిపించినా విశాఖ రూరల్ జిల్లాతో నుంచి మొదలు పెడితే విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు పూర్తిగా అట్టడుగునే ఉన్నాయని చెప్పాలి.ఈ మూడు జిల్లాల్లో గత ఏడున్నర దశాబ్దాలుగా మంత్రులు ఉప ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారు ఉన్నారు. ఎంతో మంది గట్టి నాయకులు కూడా ఇక్కడ నుంచి గెలిచారు. ఇక కేంద్ర క్యాబినెట్ లో మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన వారు ఇక్కడ నుంచి ఉన్నారు. మరి ఇంతమంది ఇన్ని రకాలుగా ఏలినా కూడా ఉత్తరాంధ్ర ఎందుకు వెనకబడిపోయింది అన్నదే ప్రశ్న. చెప్పాలంటే ఆ పార్టీ ఈ పార్టీ అని కాదు అందరూ ఉత్తరంధ్రకు అందరూ కలసి ఉత్త చేతులే చూపించారు. అధికారంలో ఉన్నపుడు ఒకలా విపక్షంలో ఉన్నపుడు మరోలా కథలు చెబుతూనే పుణ్య కాలం గడిపేశారు. అందువల్ల ఎవరు ఎవరిని అనుకున్నా కూడా జనం మాత్రం మొత్తం ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలదే తప్పు అని డిసైడ్ చేసేశారు.ఉత్తరాంధ్ర అభివృద్ధి ఇన్నాళ్ళకు గుర్తుకు వచ్చిందా అని ఎవరికి వారు ప్రశ్నించుకునే స్థితి ఉంది. తెలుగుదేశం ఈ రాష్ట్రాన్ని రెండు దశాబ్దాలకు పైగా ఏలింది. ఆ పార్టీ విశాఖను ఓటు బ్యాంక్ గా మార్చుకుంది అని వైసీపీ ఎమ్మెల్యే గుడివాడ అమరనాథ్ అంటున్నారు. నిజమే టీడీపీ అంటే ఈ ప్రాంత వాసులకు బాగా ఇష్టం. అందువల్ల ప్రతీ ఎన్నికలోనూ ఆ పార్టీకే ఓట్లు వేసేవారు. తమ ప్రాంతానికి వచ్చిన వలస నాయకులను సైతం ఆదరించి చట్ట సభలకు దారి చూపించారు. కానీ టీడీపీ ఉత్తరాంధ్రకు సాలిడ్ గా ఏం చేసింది అంటే ఈ రోజుకీ తమ్ముళ్ళు చెప్పలేరు. అంతే కాదు ఈ ప్రాంతానికి చందమామను తీసుకువస్తామని ఆశలు పెడుతూనే ఈ రోజుకూ పబ్బం గడుపుకుంటున్నారు అనే అంటారు. ఇపుడు తాపీగా మీ సత్తా మా సత్తా చూసుకుందామంటూ వైసీపీకి సవాల్ చేయడమే తమ్ముళ్లకు మిగిలింది అనుకోవాలి.టీడీపీతో విసిగిపోయే జనాలు 2019 ఎన్నికల్లో ఫస్ట్ టైమ్ వైసీపీకి ఏకపక్ష విజయాన్ని అందించారు. కానీ పరిస్థితి ఏమీ మారలేదు. తాము రాజకీయాన్ని మార్చుకున్నా అభివృద్ధి రేఖ అన్నది లేకపోవడం ఈ ప్రాంతీయులను బాధిస్తోంది. సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు లేవు, పరిశ్రమలు కొత్తవి లేవు, ఇప్పటికే ప్రకటించిన అభివృద్ధి కార్యక్రమాలు కూడా పడకేశాయి. మరి ఈ పరిస్థితులలో టీడీపీ కంటే మేమే ఉత్తరాంధ్రను అభివృద్ధి చేశామని వైసీపీ నేతలు చెప్పుకున్నా జనాలు నమ్మడం లేదు. మొత్తానికి చూసుకుంటే రెండు బలమైన ప్రాంతీయ పార్టీలు ఉత్తరాంధ్ర సెంటిమెంట్ ను అడ్డం పెట్టుకుని ఫక్తు రాజకీయమే చేస్తున్నాయి తప్ప మరేమీ కాదు అన్నది సగటి జీవుల నిఖార్సు అయిన మాట.

# విద్యుత్ చార్జీల పెంపుపై పోరాటానికి సిద్ధం

విజయవాడ సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని జనసేన నేత పోతిన వెంకట మహేష్ విమర్శించారు. మంగలవారం అయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే రెండు సార్లు విద్యుత్ శ్లాబులు మార్చి ఐదు వేల కోట్ల భారం వేశారు. జగనన్న కరెంటు షాక్ పథకంతో షాకిస్తున్నారు. ఇప్పుడు విద్యుత్ వాడకంతో సంబంధం లేకుండా బిల్లులు వేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఈ తరహా భారాలు మోపలేదు. ట్రూ అప్ ఛార్జీల. పేరుతో వడ్డీలువేసి మరీ వసూలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో వాడుకున్న విద్యుత్ కు ఛార్జిలు వసూళ్లు ఏంటి. 6,300 వేల కోట్లు వసూళ్లు చేయాలని జగన్ నిర్ణయించారు. ఇప్పుడు యూనిట్ కు రెండు రూపాయలు చొప్పున మరో తొమ్మిది వేల కోట్ల వసూళ్లకు శ్రీకారం చుట్టారు. రాబోయే రెండేళ్లపాటు ఈఛార్జీలు అమలు చేస్తున్నారు. ఈ నిర్ణయం వెనుక జగన్ దోపిడీ కూడా ఉంది. ప్రైవేటు విద్యుత్ సంస్థలు నుంచి ఆరు నుంచి ఎనిమిది రూపాయలు కు ఎందుకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్రం నుంచి తక్కువ ధరకు విద్యుత్ ఇస్తున్నా ఎందుకు తీసుకోరు. ప్రైవేటు సంస్థలు తో ఒప్పందం ద్వారా జగన్ కమిషన్లు తీసుకుంటున్నారు. ట్రూ అప్ ఛార్జీలు తో ఎందుకు వసూళ్లు చేస్తున్నారో జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలి. రైతాంగం పై కూడా ఈ విద్యుత్ భారాలు మోపుతున్నారు. అద్దె దారులు ఈ విద్యుత్ ఛార్జీల భారం ఎలా మోస్తారు. కరోనా సృష్టించిన కల్లోలం కన్నా.. జగన్ కల్లోలమే ఎక్కువుగా ఉంది. ఒక్కఅవకాశం జగన్ కు ఇచ్చినందుకు రాష్ట్రం విధ్వంసానికి గురవుతుంది. యనభై లక్షల మంది వరకు ఉపాధి కోల్పోయారు. 30,160 యూనిట్లను మాత్రమే విద్యుత్ వినియోగం జరిగింది. విద్యుత్ వాడకం పెరిగిందని ప్రభుత్వమే అబద్ధాలు చెబుతుంది. యాభై వేల కోట్ల పన్నుల భారాలను కూడా మోపారు. ఇప్పుడు15,300కోట్లు విద్యుత్ ఛార్జీల వసూళ్లు. మద్యం అమ్మకాల పేరుతో 20వేల కోట్లు భారం వేశారు. సంక్షేమ పాలన లేదు... సంక్షోభ పాలన మాత్రమే ఎపి లో నడుస్తుంది. ఒక్క అవకాశమే చివరి అవకాశమని ప్రజలే చెబుతున్నారు. అన్ని దారుల్లో వాయింపుడు మీద వాయింపుడు... షాక్ ల మీద షాక్ లు ఇస్తున్నారు. జగన్... అంధ్రాని కాదు... ఆఫ్ఘనిస్తాన్ పాలనకు కరెక్ట్ గా సరిపోతారు. అక్కడ మత్తు మందులు, దోపిడీ దారులకు అండగా ఉంటారు. మంచి తాలిబన్ నేతగా అక్కడ జగన్ ను గుర్తిస్తారు. ఇష్టం వచ్చినట్లుగా మోపుతున్న భారాలను రద్దు చేయాలి. లేదంటే ప్రజలను కలుపుకుని తిరుగుబాటు చేస్తామని అన్నారు.

# ఆగని రైతుల పోరాటం...

విజయవాడ, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)అమరావతి. ఆంధ్రుల ఆశాకిరణంగా నిలిచిన నగరం. నిలుస్తుందని అనుకున్న పట్టణం. కానీ.. రాజకీయాల్లో చిక్కుకుని.. భవిష్యత్తు ఏంటో తెలియక సతమతమవుతున్న నగరం. ఇందులో.. ఎవరినీ తప్పుబట్టడం కానీ.. మంచి అనడం కానీ.. ఎంత మాత్రం లేదు. కానీ.. లక్ష్యాన్ని చేరుకుంటారో లేదో తెలియక.. నిత్యం అక్కడ దీక్షల పేరుతో పోరాటాన్ని కొనసాగిస్తున్న రైతుల భవిష్యత్తు ఏంటి.. అన్నదే ఇక్కడ చర్చనీయాంశం.గతంలో టీడీపీ ఉన్నప్పుడు భూములు సేకరించింది. అమరావతిపై ప్రజలు ఆశ్చర్యపోయే రీతిలో ప్రచారం చేసింది. దేశానికే మహా నగరం కానుందని విశ్వాసాన్ని కల్పించింది. తర్వాత.. వైఎస్ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సహజంగానే.. పాలనలో నిర్ణయాలు, ప్రాధాన్యాలు మారుతాయి. ఈ ప్రభావం.. అమరావతిపైనా పడింది. మూడు రాజధానుల అంశం తెరపైకి వచ్చింది. అందులో అమరావతి సైతం ఉంది.అప్పటి నుంచి నేటి వరకూ.. 636 రోజులుగా ఈ పోరాటం జరుగుతూనే ఉంది. ప్రముఖులు సైతం వారికి మద్దతు తెలియజేస్తున్నారు. మరోవైపు.. 3 రాజధానుల ప్రతిపాదననూ సమర్థించేవాళ్లు చాలా మంది ఉన్నారు. రైతుల దీక్షలకు పోటీగా.. 3 రాజధానులను సమర్థిస్తూ దీక్షలు చేసినవాళ్లూ ఉన్నారు. అంతా బానే ఉంది. కానీ.. ఇలా దీక్షలు ఎన్నాళ్లు చేస్తారు.. ఎప్పటికి.. మధ్యే మార్గ నిర్ణయం వస్తుంది.. అన్నదే అస్పష్టంగా ఉంది.రైతులు కాయాకష్టం చేస్తే తప్ప పంటలు పండవు. అలాంటివాళ్లు ఇలా ఇల్లూవాకిలీ వదిలి.. పోరాడుతున్న తీరుకు.. ఎవరో ఒకరు ముందుకు రావాలి. ఫుల్ స్టాప్ పెట్టగలిగే పరిష్కారాన్ని చూపించాలి. ఇది రాజకీయంగా కూడా ప్రభావితం చూపడం లేదన్నది.. గడచిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో స్పష్టమవుతోంది. ఈ వాస్తవాన్ని రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాల్సిన అత్యవసరం ఉంది.అన్ని పార్టీల నాయకులూ కలిసి ఓ వేదికను ఏర్పాటు చేసి.. రైతులకు భరోసా కల్పించాల్సిన తక్షణ అవసరం కనిపిస్తోంది. వారి ఆవేదనకు తగిన పరిష్కారం చూపించాల్సిన అవసరం సైతం ఉంది. ఈ బాధ్యత ఎవరు తీసుకుంటారో.. ఎప్పుడు సమస్య పరిష్కారమవుతుందో? అన్నది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి


# 30 మంది ఎమ్మెల్యేలకు డేంజరేనట..

విజయవాడ, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)వైసీపీలో గత 2019 ఎన్నికల్లో చాలా మంది కొత్త ముఖాలు విజయం సాధించాయి. అప్పటి వరకు రాజకీయాలకు దూరంగా ఉన్న కొందరు యువతను పనిగట్టుకుని తెచ్చి.. జగన్ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చారు. వీరంతా కూడా జగన్ సునామీలో కొట్టుకొచ్చారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అసలు సంతకం తప్ప ఇతర రాజకీయాలు తెలియని వారిని కూడా గత ఎన్నికల్లో జగన్ గెలుపు గుర్రం ఎక్కించారు. వీరంతా తొలి ఏడాది చాలా హుషారుగా ఉన్నారు.జగనన్నకు జై‘ అంటూ.. నినాదాలు చేశారు. కానీ, గత ఆరు మాసాలుగా మాత్రం వీరిలో ఒక విధమైన బెంగ అలుముకుంది. దాదాపు 30 మందికిపైగా ఎమ్మెల్యేలు.. ఓటమి భయంతో అల్లాడుతున్నారని.. వైసీపీ సీనియర్లు చెబుతున్నారు. దీనికి కారణాలు కూడా ఉన్నాయని.. అంటున్నారు. ఒకటి.. ఇప్పటికీ చాలా మంది ప్రజలకు వైసీపీకి ఓటు వేయడమే తెలుసు తప్ప.. అభ్యర్థి ఎవరనేది క్లారిటీ లేదట. చిత్రంగా అనిపించినా.. ఇది నిజమేనని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఎందుకంటే.. గత ఎన్నికల తర్వాత.. తొలి రెండు నెలలు మాత్రమే .. ఎమ్మెల్యేలు ఎంపీలు.. నియోజకవర్గాల్లో పర్యటించారు.ఆ తర్వాత? వచ్చిన వలంటీర్ వ్యవస్థ, స్పందన కార్యక్రమాల కారణంగా వీరికి నియోజకవర్గంలో తిరిగే అవకాశం, అవసరం కూడా లేకుండా పోయింది. ఇదేదో బాగుందని అందరూ అనుకున్నారు. ఇప్పుడు నియోజకవర్గంలోకి వెళ్లినా వైసీపీ ఎమ్మెల్యేలను ఎంపీలను ప్రజలు గుర్తుపట్టే పరిస్థితి లేకుండా పోయిందనేది వీరి ఆవేదన. “అసలు మమ్మల్ని జనం పట్టించుకోవడం లేదండీ“ అని కర్నూలు జిల్లాకు చెందిన ఒక ఎస్సీ ఎమ్మెల్యే ఇటీవల మీడియాతోనే అనేశారు. నిజానికి ఇలాంటి పరిస్థితి 30కిపైగా నియోజకవర్గాల్లో ఉంది.ఎందుకంటే.. గతంలో ప్రభుత్వాలు ఏ సంక్షేమ కార్యక్రమం అమలు చేసినా నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు వాటిని ప్రజలకు అందించేవారు. చివరకు రు. 5 వేల చెక్కు పంపిణీ చేయాల్సి ఉన్నా కూడా ఎమ్మెల్యేల చేతుల మీదే నానా ఆర్భాటం చేసి మరీ ఇచ్చేవారు. అదే సమయంలో వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే ఉద్దేశంతో ప్రజలకు చేరువయ్యేవారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా వైసీపీ ప్రభుత్వమే నేరుగా లబ్ధి దారుల ఖాతాలకు నిధులు ఇస్తోంది. పోనీ.. నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేద్దామా ? అంటే అదీ లేదు.రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యేలకు.. అటు కేంద్రం నుంచి ఎంపీలకు నిధులు ఆగిపోయాయి (కరోనా నేపథ్యంలో ప్రధాని మోడీ.. ఎంపీలాడ్స్‌ను రెండేళ్లుగా ఆపేశారు). ఇక తమ తమ నియోజకవర్గాల్లో కీలక ప్రాజెక్టులు, అధ్వానంగా ఉన్న రహదారుల కోసం నేరుగా జగన్‌ను కలిసి నిధులు రాబట్టుకుందామా ? అంటే సీఎం జగన్ అపాయింట్‌మెంట్ రావడం లేదు. ఇక నియోజకవర్గ స్థాయి పదవుల విషయంలో కూడా ఈ వర్గం వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రయార్టీ లేదు. దీంతో అటు ఎంపీలు, ఇటు ఎమ్మెల్యేలు వచ్చే ఎన్నికల వరకు కూడా పరిస్థితి ఇలానే ఉంటే.. తాము గెలవడం కష్టమేనని అంటున్నారు. మరి ఏం జరుగుతుందో, ఈ సమస్య ఎలా పరిష్కారం అవుతుందో చూడాలి

# సీనియర్లతో వైసీపీకి ఇబ్బందే

విజయవాడ, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)వైసీపీలో సీనియర్ నేతలు ఏం చేయలేకపోతున్నారా? తమకున్న అసంతృప్తిని అప్పుడప్పుడు బయట పెట్టడమే తప్ప పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకోలేకపోతున్నారా? అంటే అవుననే అంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తుంది. కానీ జగన్ మాత్రం సీనియర్లను పట్టించుకోవడం లేదు. దీంతో వారిలో అసంతృప్తి తీవ్రస్థాయిలో ఉంది. కానీ వారు ప్రత్యేకించి ఇప్పుడు ఏమీ చేయలేని పరిస్థితి. మరో నాలుగేళ్లు అధికారం ఉండటంతో వారు మౌనంగానే సమయం కోసం వేచి చూస్తున్నట్లు కనపడుతుంది.శ్రీకాకుళం జిల్లాలో ధర్మాన ప్రసాదరావు సీనియర్ నేత. దాదాపు ముగ్గురు ముఖ్యమంత్రుల దగ్గర ఆయన మంత్రిగా పనిచేశారు. మంచి మాటకారి. విపక్షాలకు సయితం ధీటుగా జవాబివ్వగల నేర్పరి. అలాంటి ధర్మాన ప్రసాదరావును జగన్ పట్టించుకోవడం లేదు. తనకంటే జూనియర్లు కేబినెట్ లోకి చేరడంతో ధర్మాన ప్రసాదరావు మరింత రగలిపోతున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై తన అసంతృప్తిని బయటపెట్టిన ధర్మాన ప్రసాదరావు తర్వాత మౌనంగానే ఉండిపోయారు. ఇల్లు వదలి బయటకు రావడం లేదు.దీనికి ప్రధాన కారణం జిల్లాలో తొలిసారి గెలిచిన అప్పలరాజు మంత్రి పదవిని చేపట్టారు. తన సోదరుడికి ప్రమోషన్ ఇచ్చి ఉప ముఖ్యమంత్రిని చేసినా తనకు అన్యాయం జరిగిందనే ధర్మాన ప్రసాదరావు భావిస్తున్నారు. ఆయన అందుకే అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కూడా ఆయన పెదవి విప్పడం లేదు. తన అక్కసునంతా మౌనం ద్వారానే ధర్మాన ప్రసాదరావు జగన్ కు తెలియజేస్తున్నారు.ఇక మరో సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి కూడా ఇంతే. ఆయన గత కొద్దిరోజులుగా బయటకు రావడం లేదు. నియోజకవర్గానికే పరిమితమయ్యారు. ఈయన కూడా అసంతృప్తితోనే ఉన్నారు. ఒకటి రెండు సార్లు తన అసంతృప్తిని తెలియజేసినా షోకాజ్ నోటీసు వరకూ వెళ్లడంతో ఆయన మౌనమే మంచిదని భావిస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణ వరకూ వెయిట్ చేయాలన్నది వీరిద్దరి ఆలోచనగా ఉంది. ఆ తర్వాత కూడా పదవులు రాకుంటే జగన్ కు వీరిద్దరూ పక్కలో బల్లేల్లా తయారే అవకాశాలున్నాయంటున్నారు.

# కొడాలికి తప్పని ఇంటిపోరు...



విజయవాడ, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)ఏపీ మంత్రి వైసీపీ ఫైర్‌బ్రాండ్ నేత కొడాలి నానికి ఆయన పొలిటికల్ కెరీర్‌లోనే ఎప్పుడూ ఎదుర్కోనంత కష్టం గుడివాడలో వచ్చిపడింది. 2004లో తొలిసారి టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కొడాలి నాని ప్రతిపక్షంలో ఉన్నారు. 2009లో ఆయన మరోసారి టీడీపీ నుంచే విజయం సాధించగా.. అప్పుడు కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అప్పుడు కూడా ఆయనది ప్రతిపక్ష పాత్రే అయ్యింది. కొడాలి నాని తొలి ఎన్నికల్లో 7 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తే రెండోసారి ఆయన ఏకంగా 17 వేల ఓట్ల పై చిలుకు మెజార్టీతో ఓవరాల్‌గా 2009 ఎన్నికల్లో కృష్ణా జిల్లాలోనే టాప్ మెజార్టీ సాధించారు.కొడాలి నానిని రెండోసారి గెలిపించిన గుడివాడ ప్రజలు ఆయన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అవేవీ నెరవేరలేదు. ఇక ఆయన వైపీపీలోకి వచ్చినప్పుడు కూడా 2014 ఎన్నికల్లో ఏకంగా 11 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించడంతో పాటు గుడివాడ మున్సిపాల్టీపై సైతం వైసీపీ జెండా ఎగిరేలా కొడాలి నానికి వెన్నుదన్నుగా ఉన్నారు. బ్యాడ్‌లక్ ఏంటంటే నాని 2014లో గెలిచినా రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాలేదు. దీంతో కొడాలి నాని ప్రజలకు మీరు నా మీద ప్రేమతో నన్ను గెలిపించినా.. మన పార్టీ అధికారంలోకి రాలేదు.. నన్నేం చేయమంటారు ? అని ఎదురు ప్రశ్నలు వేయడంతో పాటు తనపై మరింత సానుభూతి పెరిగేలా చేసుకున్నారు.ఎట్టకేలకు కొడాలి నాని కల పండడంతో పాటు గుడివాడ ప్రజల కోరిక తీరింది. గత ఎన్నికల్లో కొడాలి నాని వరుసగా నాలుగోసారి విజయం సాధించారు. పార్టీ అధికారంలోకి రావడంతో ఆయన మంత్రి అయ్యారు. అయితే ఈ సారి మాత్రం ఆయన ప్రజల ప్రశ్నలకు తప్పించుకునే ఛాన్స్ లేకుండా పోయింది. ఆయన జగన్ కేబినెట్ లోనే ఓ ఫైర్ బ్రాండ్ మంత్రి. ఇరవై ఏళ్లుగా గెలిపిస్తూ వస్తున్నా కొడాలి నానిని ఏమీ అనని గుడివాడ ప్రజలు ఈ సారి మాత్రం గట్టిగానే వాయించేస్తున్నారు. కొడాలి నాని మంత్రిగా ఉన్నా గుడివాడలో అభివృద్ధి జలగ సాగుడును తలపిస్తోంది. గుడివాడ కొత్త బస్టాండ్ ఇటీవలే ప్రారంభమైన అది ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు. ఇక గుడివాడను ప్రధాన నగరాలతో కనెక్ట్ చేసే అన్ని ప్రధాన రహదారులు ఘోరంగా ఉన్నాయి. విజయవాడ ? గుడివాడ, గుడివాడ ? హనుమాన్ జంక్షన్ రహదారుల పరిస్థితి మరీ ఘోరం.ఇక నియోజకవర్గంలో మండల కేంద్రాలతో పాటు అన్ని ప్రధాన రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఇక కొడాలి నాని గుడివాడ ప్రజలు గుర్తుంచుకునే ఒక్కటంటే ఒక్క పని కూడా చేయలేదన్న విమర్శలు తీవ్రంగా వస్తున్నాయి. కేవలం టీడీపీని, చంద్రబాబును తిట్టడంలో దూకుడు చూపిస్తే సరిపోదని.. ఇరవై ఏళ్లుగా ఓటమి లేకుండా నెత్తిన పెట్టుకుంటోన్న గుడివాడ ప్రజలను గుర్తుంచుకోవాలన్న విమర్శలు ఇప్పుడు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఏదేమైనా కొడాలి నానిపై ఎప్పుడూ లేనంత వ్యతిరేకత ఇప్పుడు గుడివాడలో ఉంది. అయితే దీనిని క్యాష్ చేసుకునే దమ్ము టీడీపీలో ఉంటే కొడాలి నానికి నెక్ట్స్ కష్టమే అన్న టాక్ వచ్చేసింది.

# సి హెచ్.డబ్ల్యూ లను ఆశా కార్యకర్తల గా మార్చి 10వేలు జీతం ఇవ్వాలి

విశాఖపట్నం సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)రాష్ట్ర వ్యాప్తంగా గా గిరిజన గ్రామాల్లో పని చేస్తున్నా కమ్యూనిటీ హెల్త్ వర్కర్ లను ఆశా కార్యకర్తలు మార్చాలని,ఆశా కార్యకర్తల కు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ ఆయన ఆశా కార్యకర్తల కు 3 లక్ష రూపాయలు గ్రాడ్యుటి ఇవ్వాలని,ప్రమాద బీమా కల్పించాలని, మాస్కులు సానిటీజర్ యూనిఫామ్ ఇవ్వాలని నినదించారు, మారుమూల గిరిజన గ్రామాల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ గత ఐదు సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్నారు ఆశా కార్యకర్తల తో సమానంగా పని చేస్తున్నారు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉండగా ఆశా కార్యకర్తలకు పదివేల రూపాయలు ఇస్తున్నారు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు నాలుగు వేల రూపాయలు మాత్రమే జీతం ఇస్తున్నారు యూనిఫామ్ మెడికల్ కిట్లు ఇవ్వడం లేదు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా దీనిని అమలు చేయడం లేదు కమ్యూనిటీ హెల్త్ వర్కర్ గర్భిణీ బాలింతలకు ఆస్పత్రి తనిఖీలకు తనిఖీలకు డెలివరీ లకు సొంత ఖర్చులతో వెళ్తున్నారు ఇచ్చే నాలుగు వేలు జీతం ప్రయాణ ఖర్చులు కి అయిపోతున్నాయి. ఐటీడీఏ అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా ఈ సమస్యను పరిష్కరించడం లేదు కావున కమ్యూనిటీ హెల్త్ వర్కర్ లను ఆశల గా మార్పు చేయాలని లేదా 10000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఐటీడీఏ మేనేజరు కి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్సా మాట్లాడారు.ఏపీ. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్,ఆశా

### ఐటీడీఏ ముట్టడి....వర్షం లో ధర్నా

వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి లువై.మంగమ్మ, దాసమ్మ ,కృష్ణకుమారి, సత్యవతి,కె.పద్మా, చిన్ని,కె.శేషమ్మ,, విజయకుమారి,సుబ్బలక్ష్మి, సింహాచలం,విజయలక్ష్మి ,సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు,పాలి కి లక్కు పెద్ద సంఖ్యలో సి హెచ్ డబ్ల్యూ లు పాల్గొన్నారు.

## రైతుకోసం వినూత్నంగా నిరసన ర్యాలీ

అనంతపూర్ సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)టిడిపి ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలో రైతు కోసం అనే నినాదంతో వినూత్న రీతిలో నిరసన ర్యాలీ నిర్వహించారు.టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల గుండా ఎడ్లబండ్ల లో తాసిల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.రైతులకు వ్యతిరేకంగా పాలిస్తున్న వైసీపీ ప్రభుత్వం అంటూ కూరగాయలు నడిరోడ్డుపై వేస్తూ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తలు వ్యవసాయ పరికరాలు కూరగాయల చేతబూని ఎడ్లబండ్ల లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్లో రోడ్డు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం రైతు ద్రోహి ప్రభుత్వం సీఎం జగన్మోహన్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలను నట్టేట ముంచుతున్నారు. అన్నారు ప్రధానంగా రాష్ట్రానికి వెన్నెముక లాంటి అన్నదాతలను మరింత ఇబ్బంది పాలు చేస్తున్నారని విమర్శించారు టిడిపి ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువులు ఆకాశాన్నంటే ప్రజల నడ్డి విరుస్తున్నారు అన్నారు. రైతులకు ఏ మాత్రం సహాయ సహకారాలు అందించడం లేదని అదే టిడిపి ప్రభుత్వ హయాంలో రైతులను అన్ని విధాలా ఆదుకున్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో రైతులకు అడగడుగునా మోసాలకు పాల్పడుతున్నారు రైతులకు మోసం చేసిన ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. అనంతరం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో సూపర్డెంట్ వెంకటేశ్వరరావు కు వినతి పత్రం సమర్పించారు.

## అర్ధరాత్రి కలకలం

విజయవాడ, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)ప్రపంచం మొత్తం అత్యాధునిక టెక్నాలజీతో అభివృద్ధివైపు పరుగులు తీస్తుంటే.. మనదేశంలోని ప్రజలు మాత్రం ఇంకా మూఢనమ్మకాల మత్తులోనే మునిగిపోతున్నారు. ఆ మూఢ విశ్వాలను అడ్డం పెట్టుకుని జనాలను భయభ్రాంతులకు గురి చేస్తూ బతుకు సాగిస్తున్నారు మరికొందరు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడు గ్రామ శివారుల్లో రాత్రి వేళల్లో గుర్తుతెలియని క్షుద్రపూజలు నిర్వహించారు. అది గమనించిన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకెళితే.. కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడు గ్రామానికి చెందిన ఓ రెండు కుటుంబాలకు చెందిన అన్నదమ్ముల మధ్య గత కొంతకాలంగా భూవివాదం కొనసాగుతోంది. గ్రామ పొలిమేరలో అర్ధరాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు పూజలు చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్నారు గ్రామస్తులు. వెంటనే వారిని పట్టుకునేందుకు ఆ ప్రాంతానికి వెళ్లారు.అయితే, గ్రామ ప్రజల రాకను గమనించి పూజలు చేస్తున్న పూజారి, మరో ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. వారిని గ్రామస్తులు కొంతదూరం వరకు వెంబడించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనతో తీవ్ర భయభ్రాంతులకు గురైన గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. పూజా ప్రాంతంలో వేసిన ముగ్గులో మేకులు, కత్తులు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, కోడిని గుర్తించారు. అయితే, స్థలం వివాదంలో చేతబడి చేసి చంపేందుకు కుట్ర పన్నారని, ఇందులో భాగంగానే పూజలు చేస్తున్నారంటూ అన్నదమ్ముల్లో ఒక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే, కత్తులు, కోడిని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విశ్వాంతరాలను చేధిస్తున్న ప్రస్తుతం టెక్ యుగంలో మూఢ విశ్వాసాలకు తావు లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీసులు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. క్షుద్రపూజల పేరుతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# స్వచ్ఛాంధ్ర సంస్థ చైర్ పర్సన్ గా పోనకా దేవసేనమ్మ ప్రమాణ స్వీకారం

### .గూడూరు అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా పోనాక

నెల్లూరు సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్) గూడూరు అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తాను అనీ రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ గా పోనాక దేవసేనమ్మ వెల్లడించారు.విజయవాడలోని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో అతిరథమహారథులు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంకు గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు, మంత్రులు, ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులు,ప్రముఖులు, పోనాక అభిమానులు,కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగాఎమ్మెల్యే వెలగపల్లి మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీ అభివృద్ధి కి సేవలను అందించిన మాజీ మున్సిపల్ ఛైర్మన్ పోనాక దేవసేనమ్మను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు.గూడూరు ఎమ్మెల్యే గా తాను గెలుపొందడానికి కూడా ఎంతో దేవసేనమ్మ ,శివకుమార్ రెడ్డి దంపతులు మరియు కుటుంబ సభ్యులు సహకరించారు అని వెల్లడించారు. పోనకా దంపతులకు తాను రుణపడిఉన్నానన్నారు.ఎన్నికల్లో వారు ఎంతో కృషి చేశారని కొనియాడారు. పార్టీకి విశ్వాసంతో పనిచేసేవారు పోనకా దంపతులు అని తెలిపారు.గూడూరు పట్టణాభివృద్ధికి దేవసేనమ్మ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్గా పోనాక దేవసేనమ్మ మాట్లాడుతూ తాను మున్సిపల్ ఛైర్ పర్సన్ గా ఐదేళ్ళ పదవీ కాలంలో గూడూరు పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది అని చెప్పారు. ,పరిశుభ్రతకు పెద్దపీట వేసి డంపింగ్ యార్డ్ కొరకు సొంత నిధులు ఖర్చు చేసి కొంత మేర సమస్యను పరిష్కరించాను అని తెలిపారు.స్వచ్ఛత, ఆరోగ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఉంచాలన్నదే సీఎం జగన్మోహన్ రెడ్డి స్వచ్ఛ సంకల్పమని,వారి కలను సాకారం చేసేందుకు మేమందరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.స్వచ్ఛాంధ్రకోసం ప్రజలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారిని భాగస్వాములు చేస్తామని తెలిపారు. పరిశుభ్రతకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు.తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు, సిబ్బంది పనిచేసేవారని వారి సేవలను కొనియాడారు. అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రుల సహకారంతో ముందుకు వెళతామన్నారు. వచ్చేనెల రెండో తేదీన క్లీన్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా ప్రత్యేకకార్యక్రమాన్నిచేపడుతున్నట్లు వెల్లడించారు.పర్యావరణ పరిరక్షణ కొరకు చెత్తబుట్టలు,వాహనాలు వంటివాటిని కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో డంపింగ్ యార్డులు లేకుండా చేసేదానికి చర్యలు తీసుకుంటామని ,పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.పదవి అలంకారం కాదు అని, అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తానని దేవసేనమ్మ పేర్కొన్నారు. నంతరం ఎం.డి సంపత్ కుమార్,ఎస్. ఈ ఆనంద్,సిబ్బంది,ఎమ్మెల్యేలు, వైసిపి నేతలు ,ప్రముఖులు చైర్ పర్సన్ దేవసేనమ్మకు శాలువా లు కప్పి గజమాలలు వేసి పుష్పగు చ్ఛాలు అందించి అభినందన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర సంస్థ ఎం.డి సంపత్ కుమార్.సీ.ఈ ఆనంద్,వైకాపా నాయకులు పోనకా దివ్యతేజారెడ్డి, బాలిబోయిన రమేష్,అశోక్ కోదండరామయ్య,సురేష్ రెడ్డి.గోపాల్ యాదవ్,కోడిపర్తి శ్రీధర్,జమళ్ళవాసు,సాయి,ముని,హాషిం, ఇమ్రాన్.బిక్కుసాహెబ్. నరేష్ రెడ్డి.రవీంద్రబాబు , హాషీమ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు

నెల్లూరు సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా కోవూరులో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కోవూరు లోని స్థానిక అనకాపల్లి కళ్యాణ మండపం వద్ద ఓ కారు డివైడర్ ను ఢీ కొట్టి బోల్తా కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే కోరు నుండి నెల్లూరు వైపు వెళుతున్న మారుతి సుజుకి బాలెనొ కారు ఓటు ఓ డివైదర్ను డికొట్టింది. దీంతో కారు పల్టీలు కొట్టి పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది. కారు పల్టీలు కొట్టడంతో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు సీట్లో కూర్చుని ప్రయాణిస్తున్న వారి పరిస్థితి తీవ్ర విషమంగా ఉన్నట్లు స్థానికులు అంటున్నారు. గాయపడిన వారిని హుటాహుటిన నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కోవూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగం లో ఉన్నప్పుడు డ్రైవర్ నిద్రపోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు అంటున్నారు. ఈ ప్రమాదం ఎలా జరిగింది అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## టిక్ టాక్ దంపతుల ఘరానా మోసం

రాజమండ్రి, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో టిక్‌టాక్‌తో ఫేమస్ అయిన దంపతుల ఘరానా మోసం బయటపడింది. మామిడాల శ్రీధర్, చెరుకుమిల్లి గాయత్రిలు టిక్ టాక్ వీడియోలతో బాగా ఫేమస్ అయ్యారు. ఈ దంపతులు గోకవరానికి చెందిన గౌరిశంకర్ అనే వ్యక్తి కుమార్తెను విదేశాలకు ఉన్నత చదువుల కోసం పంపిస్తామని చెప్పారు. ఆయన దగ్గర రూ.44 లక్షలు వసూలు చేశారు.. ఆ తర్వాత నుంచి ఏవో మాయమాటలు చెబుతూ మాట మార్చారు. ఇవాళ, రేపు అంటూ చెప్పుకుంటూ వచ్చారు.గౌరీ శంకర్‌కు ఈ దంపతులపై అనుమానం వచ్చిన బాధితులు డబ్బులు తిరిగి ఇచ్చేయాలని కోరారు. దీంతో వీరిద్దరూ తమ మొబైల్స్ స్విచ్చాఫ్ చేసుకున్నారు. బాధితులు ఇద్దరు నిందితులపై గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. కోర్టు నిందితులకు 15 రోజులపాటు రిమాండ్ విధించి. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అచ్చం అన్నలాగే.. షర్మిల



హైదరాబాద్, సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్)వైఎస్ షర్మిల.. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ స్థాపించినప్పటి నుంచి.. వరుసగా సభలు నిర్వహిస్తూ పోతున్నారు. రాజకీయంగా ఆమె చేస్తున్న విమర్శలు, తిరిగి ఆమెపై వస్తున్న ప్రతి విమర్శలు పక్కన పెడితే.. తెలంగాణ రాజకీయాల్లో షర్మిల వేస్తున్న అడుగులు.. ముచ్చటగా ఉన్నాయని.. న్యూట్రల్ పొలిటికల్ అనలిస్టులు అంటున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డగా.. వైఎస్ జగన్ తోడబుట్టిన సోదరిగా.. ఆమె ప్రతిభ చాటుకుంటున్నారని విశ్లేషిస్తున్నారు.సాధారణంగా.. జగన్ ఏ ర్యాలీ చేసినా.. ఏ సభ నిర్వహించినా.. జన ప్రవాహం వెల్లువెత్తుతుంటుంది. తండోపతండాలుగా జనం తరలివస్తుంటారు. ఆ దిశగా.. పార్టీ నాయకత్వం సైతం సమర్థంగా పని చేస్తుంటుంది. 2019లో జరిగిన ఎన్నికలు కావచ్చు.. అంతకు ముందు ఓదార్పు యాత్ర కావచ్చు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన దీక్షలు కావచ్చు. ఏదైనా సరే.. జనాలు మాత్రం భారీగానే తరలివచ్చేవారు. జగన్ కు సంఘీభావం తెలిపేవారు. ఈ క్రమంలో.. జగన్ 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర చేసినప్పుడు.. షర్మిల ఎంతగానో సహకరించారు. జగన్ గైర్హాజరీలో.. తానే స్వయంగా జగనన్న వదిలిన బాణంగా ముందుకు కదిలారు. ప్రజలతో మమేకమయ్యారు. అందరినీ కలుపుకొనిపోయారు. ఆ అనుభవం.. ఇప్పుడు షర్మిలకు తెలంగాణ రాజకీయాల్లో బాగా కలిసి వస్తున్నట్టు కనిపిస్తోంది. అది? ఆమె నిర్వహించిన దళిత భేరి సభలో.. నిరుద్యోగుల కోసం ప్రతి మంగళవారం చేస్తున్న దీక్షల్లో స్పష్టమవుతోంది.అయితే.. షర్మిల వెనక ప్రశాంత్ కిషోర్ వంటి వ్యూహకర్త ఉన్నారని.. ఆయన దిశానిర్దేశంలోనే షర్మిల రాజకీయాలు చేస్తున్నారని వాదించేవారు సైతం ఉన్నారు. కానీ.. తనకంటూ ఓ పొలిటికల్ గ్లామర్ లేకుండా.. వెనకాల ప్రశాంత్ కిషోర్ ఉన్నా.. జగన్ ఉన్నా.. మరెవరు ఉన్నా.. షర్మిల స్వయంగా ఇంత ముందుకు వెళ్లలేదని అనేవాళ్లు కూడా ఉన్నారు. ఆమె సభలకు చెప్పుకోదగ్గ సంఖ్యలో వస్తున్న ప్రజలే.. ఈ చర్చకు కేంద్రంగా నిలుస్తున్నారు.కరోనా పరిస్థితులు తగ్గాక.. షర్మిల సభలకు, దీక్షలకు మరింతగా జనాలు హాజరయ్యే అవకాశాలు లేకపోలేదని.. రాజకీయ విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో పూర్తిగా వైసిపి ప్రభుత్వం విఫలమైంది

### టీడీపీ మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్) రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో, వారు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైయిందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. రైతులను వెంటనే ఆదుకోవాలని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ శరాఫ్ బజార్, పెద్దమసీదు, గాంధీ సర్కిల్ నుండి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి, ఖీఆూ ప్రాజెక్టును వెంటనే - పూర్తి చేయాలి,రైతు కోసం - తెలుగుదేశం అని నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు, తెలుగు మహిళలు, తెలుగు యువత కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోటంరెడ్డి తలపెట్టిన 'నేను నా కార్యకర్త' విజయవంతం కావాలి

### 108 టెంకాయలు కొట్టిన రూరల్ నియోజకవర్గ వైకాపా నాయకులు

నెల్లూరు సెప్టెంబర్ 14, (న్యూస్ పల్స్) నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఈ నెల 16న స్థానిక అపోలో హాస్పిటల్ నుండి ప్రారంభించనున్న" నేను నా కార్యకర్త "కార్యక్రమం పాదయాత్ర విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ స్థానిక శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రూరల్ నియోజకవర్గ వైకాపా నాయకులు 108 టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కార్యకర్త మంచిచెడులు తెలుసుకునేందుకు స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నేను నా కార్యకర్త 42 రోజుల పాదయాత్ర ఎటువంటి ఆటంకాలు లేకుండా దిగ్విజయం గా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం వైకాపా రాష్ట్ర కార్యదర్శి వై.వి రామిరెడ్డి సూచనలు, సలహాలు, ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందని తెలిపారు. శ్రీ శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో నేను నా కార్యకర్త పాదయాత్ర కార్యక్రమం ఎటువంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించారు. తన తుది శ్వాస వరకు గ్రామీణ నియోజవర్గ ప్రజల అభివృద్ధి సంక్షేమే తన ధ్యేయంగా, సేవలందిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి జీవిత కాలం వరకు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు గా కొనసాగాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో 30,31 డివిజన్ల వైకాపా నాయకులు ఎం సతీష్, వీరప్ప రెడ్డి నారాయణ రెడ్డి, వడ్డే పార్థసారథి, ఆర్ కమల్ రాజ్, డి. శ్రీకాంత్, మోహన్ రావు, నవీణ్ కుమార్ రెడ్డి, నందకుమార్, శివ, గుడి మురళి, ఎస్కే నాయబ్ రసూల్, ఖాదర్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు

# సముద్ర మార్గం ద్వారా తరలించే నాటు సారా ప్యాకెట్లు పట్టివేత

శ్రీకాకుళం, సెప్టెంబర్ 14 ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లాలో నాటు సారాను అక్రమంగా తయారు చేసి సముద్ర మార్గం ద్వారా రణస్థలం మండలం, దోనిపేట గ్రామంలోకి అక్రమంగా తరలిస్తున్న ప్రయత్నంలో భారీగా నాటు సారా ప్యాకెట్లు ను పట్టుకున్నట్టు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్ తెలిపారు.ఈ మేరకు ఆయన మంగళవారం రణస్థలం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ నందు పత్రికా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.. జాయింట్ డైరెక్టర్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, శ్రీకాకుళం, అసిస్టెంట్ కమిషనర్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, శ్రీకాకుళం వారి ఆద్వర్యంలో ముందుగా వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు తేదీ 13.09.2021 సుమారు 16.00 గంటలకు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్, ఇంటెలిజెన్సు,శ్రీకాకుళం,టేకినికాల్ వింగ్, శ్రీకాకులం వారి సహాయంతో,డిటిఎఫ్, ఎస్ఈబి,ఇన్స్పెక్టర్ రణస్తలం వారి సిబ్బంది కలసి దోనిపేట గ్రామం రణస్తలం మండలం లో జరిపిన దాడులలో ఒక నాటు సారా కేసు పట్టుకోవడం జరిగింది అని తెలిపారు.సదరు నాటు సారాయి పేకెట్లును ఒడిషా రాష్ట్రం,గంజాం జిల్లా, ఆగస్టమ్ నౌగాం వద్ద బలిగాం గ్రామంలో అక్రమంగా తయారు చేసి వాటిని సముద్రం మార్గం ద్వారా మీద మోటారు బోటు సహాయంతో దోనిపేట గ్రామానికి తరలించి అచట మరీ కొంత మంది ముద్దాయిలకు అంధచేయుచుండగా పట్టుబడినారుని అన్నారు.ఈ కేసు అందు (06) వ్యక్తులు ను అరెస్టు చేయడం జరిగిందిని,వారి వద్దనుంచి మూడు లక్షల అరవై వేల రూపాయలు విలువ చేసే (51) ప్లాస్టిక్ సంచులనందు (10,200) నాటు సారా పేకెట్లు (ఒక్కొకటి 180 ఎంఎల్ పరిమాణం గలవి) మొత్తం (1836) లీటర్లు,స్వాధీనపరచుకోని,ఒక ఆటొ,రెండు మోటార్ వాహనాలు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనపరచుకోవడం జరిగిందిని ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ పత్రిక సమావేశం లో జాయింట్ డైరెక్టర్ (యస్.ఈ.బి) కె. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ (యస్.ఈ.బి),కె. గోపాల్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబుకు మతి భ్రమించింది

పూతలపట్టు సెప్టెంబర్ 14 ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడుకు మతిభ్రమించిందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ ఎం ఎస్ బాబు విమర్శించారు. తవణంపల్లి మండలం దిగువ తడకర గ్రామంలో నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా జడ్పిటిసి అభ్యర్థి భారతి మధు కుమార్ ఆధ్వర్యంలో అడుగడుగునా మహిళలు ఎమ్మెల్యే కు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత మా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దే నన్నారు . రైతుల్లో వస్తున్న ఆదరణ చూసి చంద్రబాబు నాయుడు ఓర్వలేక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.... ఎప్పుడు లేని ప్రేమ రైతులపై ఎందుకు పుట్టుకొచ్చిందో కారణం చెప్పాలన్నారు. వైయస్సార్ సిపి అంటేనే రైతుల పార్టీని అందరికీ తెలిసిందేనని గుర్తుచేశారు... చంద్రబాబునాయుడు ఎన్ని కుయుక్తులు చేసినా రైతులు నమ్మే పరిస్థితిలో లేరని ఆరోపించారు.. చిత్తూరు జిల్లాలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రైతుల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తూ వారికి అన్ని విధాలుగా అండగ నిలుస్తున్నారని తెలిపారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం ఎల్లవేళల వారికి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు . ఈ కార్యక్రమంలో తవణపల్లె మండలం వైఎస్ఆర్సిపి కన్వీనర్ పట్నం ప్రతాప్ రెడ్డి, గాంధీ బాబు ,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పమేశ్వర్ రెడ్డి ,జొన్నగురకల రాజశేఖర్ రెడ్డి ,హరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కలెక్టరేట్ సముదాయం, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచండి




**కలెక్టరేట్ లోని సముదాయాలలో స్వచ్ఛత, పార్కింగ్, గ్రీనరీ పై ప్రత్యేక దృష్టి సారించండి**

**అధికారులను ఆదేశించిన కర్నూలు జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు**

కర్నూలు సెప్టెంబర్ 14, ( విభారె) :-కర్నూలుకలెక్టరేట్ సముదాయం, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో కలెక్టరేట్లోని సముదాయం పరిశుభ్రత, పార్కింగ్, గ్రీనరీ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ (రెవిన్యూ మరియు రైతు భరోసా) రామ సుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ డి.కె.బాలాజీ, జాయింట్ కలెక్టర్ (ఆసరా మరియు సంక్షేమం) శ్రీనివాసులు తో కలిసి సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.... మనం పనిచేస్తున్న కార్యాలయాల్లో చెత్తాచెదారం లేకుండా, దుర్వాసన రాకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ సముదాయంతో పాటు బయట ఉన్న ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని డిఆర్ ఓను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ సముదాయం ప్రాంగణంలో గ్రీనరీ పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాలని ఉద్యానవన శాఖ, అగ్రికల్చర్, డ్వామా పిడి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేటు వాహనాలు కలెక్టరేట్ లోకి రాకుండా వారికి వేరుగా పార్కింగ్ కేటాయించి, కలెక్టర్ లో పనిచేసే సిబ్బంది కూడా పాసులు జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని డి ఆర్ ఓను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇదివరకే కలెక్టరేట్లో ఉన్న పార్కులలో గ్రీనరీ పెంచేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పశువులు లోనికి రాకుండా ఎక్కడ ఎక్కడ క్లోజ్ చేయాలో అక్కడ క్లోజ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని డిఆర్ ఓను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ పైభాగంలో ఉన్న నీటి ట్యాంకులు వాటికి సంబంధించిన పైప్లైన్ సరిగా ఉన్నాయో లేదో చెక్ చేయాలని ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్అండ్ బి అధికారులును జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ ముందు పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉండకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్లోని సముదాయంలో ఉన్న ఏడు బ్లాక్ ల్లో ఆ బ్లాక్ లో ఉన్న సీనియర్ ఆఫీసర్ ఆయా కారిడార్ లు పరిశుభ్రంగా ఉంచేందుకు పర్యవేక్షణ చేయాలన్నారు. మన ఇంటిని ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుతారో అదే విధంగా కార్యాలయాల సముదాయాలను పరిశుభ్రంగా ఉంచాలని వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ (రెవిన్యూ , రైతు భరోసా)రామ సుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ డి.కె.బాలాజీ, జాయింట్ కలెక్టర్ (ఆసరా మరియు సంక్షేమం) శ్రీనివాసులు, డిఆర్ ఓ పుల్లయ్య, ఆర్ అండ్ బి ఎస్ ఈ, కలెక్టరేట్ ఏఓ వెంకటేష్, కలెక్టరేట్లోని సముదాయంలోని కారిడార్ ల్లో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కౌతాళంలో ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం...



**అధికారులు కనుసైగుల్లో కర్ణాటక మద్యం...**

**ప్రజలు ఆరోపణలు?నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు...**

**అధికారుల మాట లెక్కచేయని మద్యం అమ్మకందారులు...**

కౌతాళంమా సెప్టెంబర్ 14, ( విభారె) కౌతాళం మండలంలో పలు చోట్ల ఏకంగా బహిరంగంగా మద్యం అమ్ముతున్నట్లు ప్రజల ఆరోపణలు వినిపిస్తున్నాయి. కౌతాళం మండలంలో కొందరు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకున్నారు కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో కర్ణాటక మద్యం సరఫరా యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దీనిపై ఓ కార్యక్రమంలో డిఎస్ పి వినోద్ కుమార్, తాలూకా సిఐ పార్థసారధి, మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు చేసేవారు సదరు వ్యక్తులు వారినైనా సరే ఉపేక్షించేది లేదని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పేరు. కౌతాళం మండలంలో పలుచోట్ల ప్రాంతాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.పత్రికా విలేకరుల ప్రాంతానికి వెళ్లగా వచ్చిన సమాచారం నిజమేనని తెలిసింది.కొత్తగా వచ్చిన జిల్లా ఎస్పీ ఈ విషయం తెలుసుకున్న తర్వాత ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే

# రైతులను అందుకోవడంలో జగన్ ప్రభుత్వం విఫలం



**పాలకుర్తి తిక్కరెడ్డి**

మంత్రాలయం సెప్టెంబర్ 14, ( విభారె) : రాష్ట్రంలో రైతులను మోసము చేస్తూన్న ప్రభుత్వం వైయస్సార్ జగన్ ప్రభుత్వం అని రైతులను ఆదుకోవడంలో ఘోరాతి ఘోరంగా విఫలం అయిందని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు దేశం పార్టీ పిలుపు మేరకు రైతులు కోసం-తెలుగు దేశం కార్యక్రమంలో మండల కన్వీనర్ పన్నాగ వెంకటేషప్ప స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాగంగా మంత్రాలయంలో తెలుగు దేశం పార్టీ నుండి యం ఆర్ ఓ ఆఫీసు వరకు ర్యాలీ గా వెళ్లి స్థానిక యం ఆర్ ఓ ఆఫీసు దగ్గర మండల నాలుగు మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. పాలకుర్తి తిక్కరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం చేసింది ఏమి లేదు అని ఈ రాష్ట్ర ప్రభుత్వం లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని పాదయాత్ర లో రైతులు కోసం ఇచ్చిన హామి 5 వేల కోట్ల ధరల స్థిరీకరణ హామి అమలు చేయాలని రైతాంగ వ్యతిరేక విధానాల కారణంగా రైతులు ఆత్మహత్యలు ఎక్కువ జరిగిన ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యము చేస్తుందని విద్యుత్ మోటార్లు బిగించి రైతులు మెడకు ఉరి తాడు బిగిస్తూన్నారని ఆవేధన చెందారు. రైతులకు ఎరువులు మందులు విత్తనాలు ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గతంలో వున్న ప్రభుత్వం రైతులకు అని విధాలుగా ఇన్ పుట్ సబ్సిడీ ప్రత్యేక ప్రోత్సాహలు డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ పై యంత్రాలు ఇచ్చి రైతులను అందుకుంటే ఈ వైయస్సార్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీటి ప్రాజెక్టులు కాలువలు నిర్మాణంలో నిర్లక్ష్యము చేస్తూ ప్రభుత్వం రైతులను మోసము చేస్తుందని నిర్లక్ష్యము వీడి రైతులను అందుకోవాలని డిమాండ్ చేశారు. మా నియోజకవర్గంలో ఈ సంవత్సరం పంటలు పూర్తిగా దెబ్బ తిన్నా యని రైతులు అందరికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నవర రమాకాంత్ రెడ్డి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆడివప్ప గౌడ్ కౌతాళం మండల కన్వీనర్ గోతులదోడ్డి ఉలిగయ్య తెలుగు యువత జిల్లా ప్రదాన కార్యదర్శి దివాకర్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయుడు నియోజకవర్గం అధ్యక్షులు సుదీర్ రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప ముత్తు రెడ్డి పల్లెపాడు రామిరెడ్డి జిల్లా నాయకులు నాడిగేని అయ్యన్న కోట్రేష్ గౌడ్ కురుగోడు చావిడి వెంకటేష్ గోపాల్ రెడ్డి పెద్ద కడూబురు మండలం కన్వీనర్ బసలదోడ్డి ఈరన్న జిల్లా తెలుగు యువత మంజునాత్ జ్ఞానేష్ మాజీ సర్పంచ్ లు జంపాపురం క్రిష్ణ రెడ్డి చిన్న భూంపల్లి నరసింహులు చిలకలడోణ హనుమంతు సూగురు నాగేష్ సీనియర్ నాయకులు చితలగేని నర్సిరెడ్డి నాడిగేని వీరారెడ్డి తాయన్న పంపాపతి రణ తిక్కన్న వగరూరు రామిరెడ్డి అబ్దుల్ మల్లికార్జున ప్రభాకర్ రెడ్డి జనార్ధన్ మైనారిటీ నాయకులు టిపుసుల్తాన్ రహ్మాన్ యస్ సి సెల్ జిల్లా కార్యదర్శి సల్మాన్ రాజు యోబు అధ్యక్షులు బోగ్గుల నరసన్న రాజబాబు సునీల్ బాలస్వామి బెళగల్ సర్పంచ్ రామయ్య గుండేష్ ఉసేని రాజశేఖర్ రెడ్డి ఆనంద్ రాజు తెలుగు యువత రోహిత్ త్రిమూర్తి రీశీ దుద్ది నాగేష్ బసలదోడ్డి క్రిష్ణ చిదనంద తోవి విజయ్ నాడిగేని మహదేవ్ వగరూరు లింగన్న హనుమన్న ప్రకాష్ హనుమంతు అన్ని గ్రామాలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మృతి చెందిన ఖాతాదారునికి యూనియన్ బ్యాంక్ ఔదార్యం

బేతంచెర్ల సెప్టెంబర్ 14, ( విభారె): ఖాతాదారుల శ్రేయస్సే యూనియన్ బ్యాంక్ లక్ష్యమని మేనేజర్ బి.నాగమేల్లేశ్వరుడు మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తగరీష్ రవికుమార్ తమ బ్యాంకు నందు హౌసింగ్ లోన్ కలిగి ఉన్నాడని, లోన్ సమయంలో ఇండియన్ ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా భీమా చేశామని, సదరు వ్యక్తి మరణించడంతో,కుటుంబానికి ఆసరానిచ్చేందుకు ఇన్సూరెన్స్ కంపెనీ ఏరియా మేనేజర్ శరత్ కుమార్ ద్వారా



రూ.14,90,707/- లను మృతి చెందిన టి.రవి కుమార్ భార్య వసంత కు చెక్కు అందజేశారు.ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కుటుంబానికి ఆసరా భీమానేనని, భీమా ద్వారా బాధిత కుటుంబాలకు రుణ భారం తగ్గించడమే కాక, వారి భవిష్యత్ కు భారసానిచ్చినవారౌతారని, మేనేజర్ తెలిపారు. ఇటువంటి సదవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకొని భీమాయే ధీమా అనే నమ్మకాన్ని కలిగి ఉండాలని తెలిపారు.చెక్కును అందించిన వారిలో ఇన్సూరెన్స్ కంపెనీ సిబ్బంది లింగేశ్వర రెడ్డి, బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భావోద్వేగాలతో కూడిన అందమైన ప్రేమకథ..!

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య - నేచురల్ బ్యూటీ సాయి పల్లవి జంటగా నటించిన తాజా చిత్రం "లవ్ స్టోరీ". సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ఈ చిత్రానికి




దర్శకత్వం వహించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ చిత్రాన్ని ఎట్టకేలకు థియేటర్లలోకి తీసుకొస్తున్నారు. కరోనా సెకండ్ వేవ్ పరిస్థితుల కారణంగా వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమాని 2021 సెప్టెంబర్ 24న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషనల్ కార్యక్రమాలు మొదలు పెడుతున్న మేకర్స్.. తాజాగా 'లవ్ స్టోరీ' చిత్ర థియేట్రికల్ ట్రైలర్ ను విడుదల చేశారు.లోన్ తీసుకొని బిజినెస్ చేయడం ద్వారా లైఫ్ లో సెటిల్ అవ్వాలనుకునే జుంబా డ్యాన్సర్ రేవంత్ గా నాగచైతన్య ను చూపించడంతో ఈ ట్రైలర్ ప్రారంభమైంది. మరోవైపు అత్తెసరు మార్కులతో బీటెక్ పూర్తి చేసి ఎలాగైనా సాఫ్ట్ వేర్ జాబ్ సాధించాలనే యువతి మౌనిక గా సాయి పల్లవి ని చూపించారు. అయితే మౌనికలో దాగి ఉన్న డ్యాన్సింగ్ టాలెంట్ ని గుర్తించిన రేవంత్.. ఆమెను మంచి డ్యాన్సర్ అవ్వాలని ప్రోత్సహిస్తున్నాడు. ఈ క్రమంలో వీరిద్దరూ ప్రేమలో పడగా.. కులాలు ఆస్తులు అంతస్తుల వల్ల పెద్దలు వీరి ప్రేమను అంగీకరించడం లేదని తెలుస్తోంది.'లవ్ స్టోరీ' ట్రైలర్ చూస్తుంటే ఈ సినిమాలో అందమైన ప్రేమ కథతోపాటు హృదయాన్ని తాకే భావోద్వేగాలు కూడా ఉన్నాయని అర్థమవుతుంది. 'ఫిదా' తర్వాత శేఖర్ కమ్ముల మరోసారి సున్నితమైన ప్రేమ కథను చెప్పబోతున్నాడని తెలుస్తోంది. తెలంగాణ నేపథ్యంలో సెట్ చేయబడిన ఈ లవ్ స్టోరీ లో నాగచైతన్య - సాయి పల్లవి తెలంగాణ యాసలో మాట్లాడి ఆకట్టుకున్నారు. 'బీటెక్ బీటెక్కే.. డ్యాన్స్ డ్యాన్సే.. బిల్ గేట్స్ వచ్చి ప్రభుదేవా ని తన జాబ్ అడిగితే దొబ్బేయ్ అంటాడు..' 'మనకు లోన్లు ఇవ్వరు.. రెంటుకు రూములు ఇవ్వరు.. పిల్లనిస్తార్రా' 'బతుకోసం ఈ ఉరుకులాట నాతో కాదింక.. చస్తే చద్దాం.. కానీ తేల్చుకొని చద్దాం' వంటి డైలాగ్స్ అలరిస్తున్నాయి.'లవ్ స్టోరీ' చిత్రంలో రాజీవ్ కనకాల - దేవయాని - ఈశ్వరీరావు ఇతర ముఖ్యమైన పాత్రల్లో కనిపిస్తున్నారు. మిడిల్ క్లాస్ యువకుడిగా నాగ చైతన్య కెరీర్ లోనే బెస్ట్ పెరఫార్మన్స్ ఇచ్చాడని తెలుస్తోంది. 'సారంగ దరియా' 'ఈ చిత్రం చూడు' వంటి చార్ట్ బస్టర్స్ ఇచ్చిన మ్యూజిక్ డైరెక్టర్ పవన్ సిహెచ్.. నేపథ్య సంగీతం కూడా బాగా ఇచ్చాడు. సినిమాటోటగ్రాఫర్ విజయ్ సి కుమార్ విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మార్తాండ్ కె. వెంకటేష్ ఈ చిత్రానికి ఎడిటింగ్ వర్క్ చేశారు. మొత్తం మీద ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలు రెట్టింపు చేసిందని చెప్పవచ్చు. సోనాలి నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ - అమిగోస్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. కె నారాయణదాస్ నారంగ్ - పి. రామ్మోహన్ రావు నిర్మాతలుగా వ్యవహరించారు.

# 'పుష్ప' ప్లానింగ్ మామూలుగా లేదుగా..!

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ - డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా "పుష్ప". శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమాని రెండు భాగాలుగా రూపొందిస్తున్నారు. ఫస్ట్ పార్ట్ ని 'పుష్ప: ది రైజ్' పేరుతో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు. 2021 క్రిస్మస్ సీజన్ సందర్భంగా డిసెంబర్ నెలలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ఇది వరకే ప్రకటించారు.క్రిస్మస్ పండుగ డిసెంబర్ 25వ తేదీన అయినప్పటికీ.. ఆ సీజన్ ని క్యాష్ చేసుకోడానికి సాధారణంగా సినిమాలను కాస్త ముందుగానే రిలీజ్ చేస్తుంటారు. ఈసారి ఫెస్టివల్ శనివారం వచ్చింది. అందుకే డిసెంబర్ 24న శుక్రవారం రోజున పలు కొత్త సినిమాల విడుదలలు ప్రకటించారు.




వాటిలో బాలీవుడ్ స్టార్ హీరో అమిర్ ఖాన్ - యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య కలిసి నటిస్తున్న 'లాల్ సింగ్ చద్దా' సినిమా కూడా ఉంది. పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో 'లాల్ సింగ్ చద్దా' చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.ఈ నేపథ్యంలో 'పుష్ప: ది రైజ్' చిత్రాన్ని పరిస్థితులు అనుకూలిస్తే ఒక వారం ముందుగానే అంటే డిసెంబర్ 17న థియేటర్లలోకి తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారట. పాన్ ఇండియన్ ప్రాజెక్ట్ కావడంతో నార్త్ లో 'లాల్ సింగ్ చద్దా' చిత్రంతో పోటీ పడటం కంటే.. ముందే వచ్చి క్రిస్మస్ వరకు కలెక్షన్స్ కొల్లగొట్టాలని పుష్పరాజ్ ఆలోచిస్తున్నారట. సినిమా బాగుంటే రెండో వారంలో ఎలాగూ ప్రభావం చూపుతుంది. ఆపై వచ్చే వారంలో డిసెంబర్ 31 - జనవరి 1 కూడా కలిసి వస్తాయి. అందుకే మేకర్స్ ఈ విధంగా ప్లాన్ చేస్తున్నారని.. 'పుష్ప-1' కోసం డిసెంబర్ 17నే ఫిక్స్ చేస్తారని టాక్ నడుస్తోంది.ఏదేమైనా 2021లో థియేటర్లలోకి వచ్చే భారీ సినిమా 'పుష్ప' అనే చెప్పాలి. దసరా సందర్భంగా రావాల్సిన 'ఆర్.ఆర్.ఆర్' చిత్రం ఇప్పటికే వాయిదా పడింది. ఈ ఏడాది వస్తాయనుకున్న 'రాధే శ్యామ్' 'భీమ్లా నాయక్' చిత్రాలు వచ్చే సంక్రాంతి బరిలో దిగుతున్నాయి. ఇన్నాళు పుష్ప కు పోటీగా మారుతుందని భావించిన 'కేజీయఫ్ 2' సినిమా కూడా 2022 సమ్మర్ కు పోస్ట్ పోన్ అయింది. దీంతో ఇప్పుడు టాలీవుడ్ బాక్సాఫీస్ ఆశలన్నీ అల్లు అర్జున్ సినిమాపైనే ఉన్నాయి. అప్పటికి థియేటర్లు కూడా పూర్తి స్థాయిలో నడుస్తాయి కాబట్టి.. 'పుష్ప' చిత్రం హిట్ టాక్ తెచ్చుకుంటే భారీ వసూళ్లు రాబట్టే అవకాశం ఉంది.కాగా 'పుష్ప' చిత్రంలో అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తోంది. మలయాళ స్టార్ ఫహాద్ ఫాజిల్ విలన్ గా కనిపించనున్నాడు. రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. మిరోస్లా కుబా బ్రోజెక్ సినిమాటోగ్రఫీ.. ఆంటోనీ రూబెన్ ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. రసూల్ పూకుట్టి సౌండ్ డిజైనర్. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై నవీన్ ఎర్నేని - వై రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఆర్య' 'ఆర్య 2' వంటి చిత్రాల తర్వాత బన్నీ - సుక్కూ కాంబోలో వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# హలో బ్యూటీ చలో బాలీవుడ్



కొందమంది స్టార్ కిడ్స్ అదృష్టం కొద్ది స్టార్స్ అయితే.. కొందరు మాత్రం ఎంత పెద్ద స్టార్స్ కిడ్స్ అయినా కూడా ప్రేక్షకుల వద్ద గుర్తింపు దక్కించుకునేందుకు పిల్లి మొగ్గలు వేయాల్సి వస్తుంది. వారసులం అంటూ ఎంట్రీ ఇచ్చిన ఎంతో మందిలో కొద్ది మంది మాత్రమే సక్సెస్ లను దక్కించుకుని ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. చాలా మంది మాత్రం అదృష్టం కలిసి రాకపోవడంతో అల అలా కెరీర్ ను నెట్టుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి స్టార్ కిడ్స్ అనగానే స్టార్స్ అవుతారు అనే ఒక వాదన ఈమధ్య కనిపించడం లేదు. ట్యాలెంట్ ఉంటేనే స్టార్స్ అవుతారు అంటూ పలు సందర్భాల్లో నిరూపితం అయ్యింది. అందుకే కొందరు ఎంట్రీ వరకు తమ పేరెంట్స్ పేర్లు వాడుతున్నా ఆ తర్వాత మాత్రం సొంతంగానే స్టార్ డమ్ ను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.హలో సినిమా తో హీరోయిన్ గా పరిచయం అయిన స్టార్ డైరెక్టర్ ప్రియదర్శన్ కూతురు కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్ గా సక్సెస్ అవ్వలేక పోయింది. అఖిల్ కు జోడీగా నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. ఆ తర్వాత చిత్రలహరి మరియు రణరంగం అనే సినిమాలను కూడా కళ్యాణి చేసింది. కాని అవేవి కూడా ఆమెకు సక్సెస్ ను తెచ్చి పెట్టలేదు. ఆమెకు మంచి పేరును తీసుకు రాలేక పోయాయి. అయినా కూడా ప్రయత్నాలు ఆపకుండా సినిమాలు చేస్తూనే ఉంది. తెలుగు తో పాటు తమిళం మరియు మలయాళంలో కూడా ఈమె ప్రయత్నాలు చేసింది. చివరకు ఈమె బాలీవుడ్ కు వెళ్లేందుకు సిద్దం అయ్యింది.బాలీవుడ్ లో దర్శకుడు ప్రియదర్శన్ కు మంచి పేరు ఉంది. అక్కడ చాలా హిట్ సినిమాలను తెరకెక్కించిన ప్రియదర్శన్ కూతురు అనగానే మేకర్స్ నుండి ఆమెకు మంచి రెస్పాన్స్ అయితే దక్కింది. సౌత్ లో సక్సెస్ కాని వారు ఇక్కడ అదృష్టం కలిసి రాని వారు బాలీవుడ్ లో మంచి సక్సెస్ ను దక్కించుకున్నారు. ఎక్కడికో వెళ్లి పోయారు. అందుకే ఈ అమ్మడు కూడా తన తండ్రి పేరు చెప్పి ఎంట్రీ ఇచ్చినా ఆ తర్వాత తన సొంత ట్యాలెంట్ తో అక్కడ స్టార్ గా మారుతుంది అనే నమ్మకంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి బాలీవుడ్ లో వచ్చే ఏడాది వరకు హలో బ్యూటీ కళ్యాణి ప్రియదర్శిణ్ సినిమా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బ్లూ కలర్ జెర్సీలో కనిపించనున్న ఆర్సీబీ.. ఎందుకంటే?

యూఏఈ వేదికగా జరిగే ఐపీఎల్ రెండో దశలో తమ మొదటి మ్యాచ్‌లో ఎరుపు రంగు జెర్సీలో కాకుండా బ్లూ కలర్ జెర్సీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బరిలోకి దిగనుంది. రాయల్ ఛాలెంజర్స్ సెప్టెంబర్ 20 న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది. అయితే ఈ మ్యాచ్‌లో.. రెండేళ్లుగా కరోనాపై పోరాటం చేస్తున్న ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కి కృతజ్ఞతగా రెడ్ జెర్సీకి బదులుగా బ్లూ జెర్సీని కోహ్లి సేన ధరించనుంది. "కోవిడ్ మహమ్మారికి వ్యతిరేకంగా పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ఫ్రంట్ లైన్ వారియర్స్ అమూల్యమైన సేవకు నివాళి అర్పించేందకు...ఫ్రంట్‌లైన్ యోధుల పీపీఈ కిట్‌ల రంగును పోలివుండే బ్లూ జెర్సీని ధరించడం ఆర్సీబీ సభ్యులుగా మాకు గర్వకారణం' అని ట్వీట్ చేసింది. కాగా గత కొద్ది సీజన్ల నుంచి ఏదో ఒక మ్యాచ్ లో పర్యావరణం పట్ల తమ మద్దతును తెలపడానకి ఆకుపచ్చ జెర్సీని ఆర్సీబీ ధరించేది. ఐపీఎల్ ఫేజ్-1 సమయంలో కూడా మే 3 న కేకేఆర్‌తో జరిగే మ్యాచ్‌లో బ్లూ జెర్సీలో కనిపించబోతున్నట్లు ఆర్సీబీ జట్టు ప్రకటించింది. కరోనా కారణంగా ఐపీఎల్ అర్ధవంతంగా వాయిదా పడడంతో ఇప్పుడు బ్లూ జెర్సీను ధరించనునన్నారు. అయితే ఫేజ్-1 రాయల్ ఛాలెంజర్స్ మొదటి ఏడు మ్యాచుల్లో ఐదు విజయాలతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. కాగా కాగా సెప్టెంబర్ 19న ముంబై ఇండియన్స్, సీఎస్‌కే మధ్య మ్యాచ్‌తో ఐపీఎల్ 2021 ఫేజ్ 2 ప్రారంభం కానుంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**